TEXT PROBLEM WITHIN THE BOOK ONLY

UNIVERSAL LIBRARY
OU_204072
UNIVERSAL LIBRARY

శ్రీ

దేశబంధు

# చిత్తరంజనదాసు జీవిత చరిత్ర


గ్రంధకర్త:

ఆర్. నారాయణమూర్తిగారు బి. యే.



పబ్లిషర్:

ఎసుప్రలేటి బాపిరాజు,

బుక్సెల్లర్, రాజమండ్రి.

1944



కాపీరైటు రిజిష్టరుడు


వెల 0—8—0

# ఒక్కమాట

పాఠకులారా!

భరతఖండ మేనాటినుండియో నిఖిల సంపదల కాలవాలమైనట్లే, సకలభోగభాగ్యములకు నిలయమైనట్లే, దేశభక్తులకును, దేశసేవకులకును, పుట్టినిల్లయినది. ఎందరో మహానీయు లుద్భవించి తమ సర్వశక్తులను దేశమాతకు ధారవోసి యశఃకాయము నిటవదలి స్వర్గసీమ కేగినారు. వారి తర్వాతివారమైన మనమప్పుడప్పుడు వారియాశయములను, వారిఉదారత్యాగములను మననము చేసికొనుటకును, వారియడుగు జాడలలో శక్త్యానుసారముగా నడచుటకును వారిధన్యజీవితములు హృదయసీమలందు తాండవించుచున్నను, కన్నులకు కట్టినట్లు మనయెట్టయెదుట గన్పట్టుచుండుట మన భావిజీవితములకు శ్రేయోదాయకము. ఇట్టి సదాశయముతో ఇంతవరకు వెలువరించిన గాంధీ, జవహర్ మొదలగు మహనీయుల జీవితములతోబాటు శ్రీ దేశబంధు చిత్తరంజనదాసు జీవితచరిత్రను వెలువరించి మీయెదుట బెట్టుచున్నాము. దానివలన దేశాభ్యుదయమున కెంతవఱకు మాయాశయము తోడ్పడినదో చదువరులే తెలుపగలరని విశ్వసించుచున్నాము.

ఇట్లు,

ప్రకటనకర్త.

శ్రీ పరబ్రహ్మణే నమః

## దే శ బం ధు

# శ్రీ చిత్తరంజనదాసుజీవితచరిత్ర

శ్రీ చిత్తరంజనదాసు 1870 సంవత్సరము నవంబరు 5 వ తేదీని శుభముహూర్తమున జనన మాయెను. సెంట్రలు కలకత్తాలో పెర్టిటాల్ డంగా వీధిలో నతఁడు జన్మించెను. కలకత్తాపేటలో నిదికూడ ముఖ్యమైనవీధి. ఈవీధిలో పెద్ద వర్తకులు, ఉద్యోగస్థులు నివసించువారు. చిత్తరంజన్ తండ్రిపేరు 'భుజాన్ మోహన్ దాస్' మోహన్ దాసు పత్రికాసంపాదకునిగాను, ప్లీడరువృత్తియు సమముగా జేయుచుండెను. ఢక్కా జిల్లాలో విక్రమపూరుతాలూకాలో తెలింబగ్ నగరమున పేరుప్రఖ్యాతి గాంచిన వైద్యకుటుంబములో నుండి వచ్చెను. విక్రమపూరు అన్నివిషయములలోను ప్రఖ్యాతి గాంచినది. అక్కడ గొప్పవిద్వాంసులుండిరి. సాంఘికవిషయములో రాజకీయవిషయములోను ప్రజలు పాల్గొనుచుండిరి. ఇక్కడ విద్యనేర్పిన వారందరును గొప్పపదవులలో నుండిరి. పేరుకీర్తులను గడించిరి. అటువంటిప్రదేశములో చిత్తరంజనకుటుంబము బయలుదేరెను. బెంగాలుప్రజ లందరును విద్యావంతులయ్యు చాలమంది భూమిమీఁదనే యాధారపడియుండిరి! విశేషముగా

భూమిని పంచించి ధరియిస్తైరి. అది చాల సారవంతమైన భూమి కాబట్టి ప్రజ లెక్కువగ పైరుపంటల జీవనాధారముగ గైకొనిరి. మన వైద్యకుటుంబముకూడ సామాన్యమైన భూవసతిని కలిగియుండెను. కొంతకాలమునకు చిత్తరంజను తాతలలో నొకరును, యిద్దరు పినతండ్రులును విక్రమపూరును వదలి "బారిసల్" అను గ్రామమునకు వచ్చి అక్కడ నివాస మేర్పరచుకొనిరి. ఇక్కడ వారు న్యాయవాదవృత్తినుండి పేరును గడించిరి. వీరు కూడ చాలపట్టుదల కలిగి కొంచెము కోపస్వభావము గలవారు వారు తలంచిన కార్యములను సాధించుటలో నెంతటివారినైన ధిక్కరించు స్వభావము గలవారు కాని విద్యావంతు లగుటచే వారి ప్రవర్తనావిధానమే బాగుండెను. చిత్తరంజన్ తండ్రి బ్రహ్మసమాజములో చేరి ఆమతము ననుసరించుచుండెను. ఈసమాజమును గొప్పవ్యాప్తిలోనికి తెచ్చుటకు ప్రయత్నములు చేసెను. ఇతని సహోదరులు మిగిలినవారుకూడ బ్రహ్మసమాజమునందు చేరిరి. ఈమతసంబంధమైన యొకపత్రికకు మోహన్ దాసు సంపాదకునిగా పనిచేసెను. ఈపత్రికపేరు 'బెంగాల్ పబ్లిక్ ఒపీనియన్' ఇది వారమున కొకసారి వెలువడుచుండును. అక్కడ బ్రహ్మసమాజమందిరము నీపత్రికాలయము నాభవనములో నుండెను. మతభావములను విరివిగా పత్రికలో వ్రాయుచుండెను. పత్రికమూలన మతమునుగూర్చి ప్రజాభిప్రాయములను గ్రహించి వాటికి దగిన సమాధానములను వ్రాయుచుండెను. ఇందుకు సమ్మతించి అనేకులీసమాజములో జేరిరి.

ఈవిధముగా బ్రహ్మసమాజము వ్యాప్తిలోనికి వచ్చెను. తక్కిన అన్నదమ్ములకంటె బ్రహ్మభావాభివృద్ధికై మోహన దాసునకు సహాయముగ నేర్పడుచుండెను. తన బిడ్డ చిత్తరంజను నకుగూడ బాల్యమునందే యీ బ్రహ్మసమాజతత్త్వమే యలవడెను. మోహనదాసునకు ప్రచారములో అధికధనవ్యయ మయ్యెను. ధననష్టము కలిగినను సమాజసేవయందు నాతనికి తగ్గలేదు. మతాభివృద్ధికై సర్వస్వార్పణ కలిగియుండెను. ఈమతసిద్ధాంతములు [illegible] ప్రచారములో మున్నట్లు మనకు తెలియుచున్నది. [illegible] నిరాకారుడు నను చ్చయము చేయు సర్వసంయోగములో దేవుడున్నాడనియు, మతభేదములు లేవనియు, ఆత్మపరిశోధనాపరాయణమే ఈమత తత్త్వమనియు మోహనదాసు, అతని అనుచరులు ప్రచారము చేసిరి. కర్మకాండ పనికిరానిదనియు, యజ్ఞయాగాదికము నిషర్జించవలెననియు, వారిచ్చిన జీవితము లేదనియు, ఆత్మశుద్ధి యే ప్రధానమనియు, స్త్రీ స్వాతంత్ర్య మియ్యవలెననియు, విధవావివాహము నుత్సాహపరచవలెననియు నీ మతస్థుల పూర్ణాభిప్రాయము. మన ఆంధ్రదేశములోగూడ బ్రహ్మ సమాజభవనములు మతప్రచారము కూడ నున్నవి. వితంతువులైన బాలికలకు విద్య నేర్పుచు వారికి పునర్వివాహములు చేయుచుండిరి.

చిత్తరంజను తండ్రియగు మోహనదాసు కుటుంబవిషయములలోను, సాంఘికవిషయములలోను శ్రద్ధవహించక

సమాజాభివృద్ధికే పాటుపడెను. ధనలాభము లేకపోయినను గొప్పకీర్తిని గడించెను. ఇతని మతతత్త్వమును చిత్తరంజన్ విపులముగ విశాలబుద్ధితో గ్రహించి, అతని కనుగుణముగా పరివర్తించుటకు ప్రయత్నము చేయువాడు. మోహనదాసు ధర్మమార్గప్రవర్తకుడు, భూతదయ కలిగినవాడు, ప్రజల కుపకారము చేయువాడు, మంచినీతులను ప్రజలకు బోధించువాడు, ఇతరవిషయములలో జోక్యము కలుగజేసికొనక తనకార్యములందే దీక్షనువహించి కార్యనిమగ్నుడై యుండెడువాడు తండ్రియొక్క సద్గుణములను కుమారుడు గమనించి అట్లు ప్రవర్తించువాడు. కాని పినతండ్రియొక్క ధీరస్వభావముకూడ చిత్తరంజనులో నుండెను. అందు ముఖ్యముగా మోహనదాసు సోదరులలో నొకడైన దుర్గమోహనదాసు మంచి ధీరత్వము కలిగి ప్రతికార్యములోను ముందడుగు వేయువాడు. 1861 సంవత్సరములో కలకత్తాలో హైకోర్టును నూతనముగా ప్రభుత్వమువా రేర్పాటుచేయగా దుర్గమోహనదాసు ప్రాక్టీసుచేయుట కక్కడకు వచ్చి నివాస మేర్పరచుకొనెను. ఈయన క్రిమినలులో గొప్పపేరును గడించెను. ఈయనకు పట్టుదలగల ప్రభావము కాబట్టి తన పెద్దకుమార్తెను కూచ్ బీహార్ మహారాజున కిచ్చి పెండ్లిచేయుట కంగీకరింప లేదు. ఆయన బ్రహ్మసమాజికు డగుటచేతను మత భేదములవలన తనకుమార్తె నిచ్చి వివాహముచేయక అంతటిగొప్ప సంబంధమునుకూడ వదలుకొనెను. దీనినిబట్టి దాసుకుటుంబములోని

వారికి బట్టుదలయే ప్రధానవిషయమని మనము గ్రహింపనగును. అప్పటికి బ్రహ్మసమాజనాయకుడు 'కేశవ్ చంద్రసేన్' అను గొప్పమతోద్ధారకుడు. ఈయన తనకుమార్తె నొకస్వతంత్రరాజున కిచ్చి వివాహము చేసెను.

మఱియు తన సవతితల్లియైన వితంతువునకు పునర్వివాహము చేసెను. ఈవివాహములు జరిగినవెంటనే ప్రజలలో కలకలము బయలుదేరెను. చంద సేనుని వెలివెట్టిరి. అప్పుడు చాల యలజడి కలిగినది. వయసుమీరిన సవతితల్లికి వివాహము కూడదనియు, కుమార్తెను బాల్యవివాహము చేయుటకూడదనియు ప్రజాభిప్రాయము. దీనిపై పత్రికలలో అనేకవ్యాసములుగా వ్యతిరేకముగ వ్రాయుట ప్రారంభించిరి. ఇట్టిపత్రికలలో మోహన్‌దాసు తెలుస్తముగా నిరసించెను.

శ్రీచిత్తరంజన్ తల్లిపేరు "నిస్తారిణీదేవి" ఈమె పెద్దకుటుంబములోని స్త్రీ. దానధర్మములను చేసి కీర్తిగాంచెను. ఆపదలోనున్నవారి నాదరించుట యీమె స్వభావము. ప్రకృతి ప్రభావమువలన సంఘములోని మార్పులను గ్రహించి ప్రేమ సంబంధమైన హితబోధనలు చేసెను. రాజారామమోహన్ రాయి మతమన్న యీమెకు చాల యిష్టము. రామమోహన్ రాయి సహగమనము నతిక్రమించిన మహాపురుషుడు, ప్రతిమనుష్యుడును స్త్రీయును వారువారు చేసిన పూర్వజన్మసుకృతముల

వలెన యీజన్మలో కర్మ ననుభవింపవలయును. అట్టివిషయము లో భార్య భర్తతో సహగమనము చేయు టధర్మమనియు స్త్రీబలవస్త్రరణ స్వాతంత్ర్యమిచ్చుటనైన మనుష్యజాతికి దగదనియు రాజారామమోహనరాయి అభిప్రాయము. మోహన్‌రాయి మతా భిమానులైనను సన్యాసిఖర్ దేవి అవసరమైనంతవరకు హితోప దేశములు చేయుచు, అన్యకార్యములకు బోకుండ నిర్మలమైన ప్రవర్తన కలిగి యుండెను. ఈమె ఔదార్య మొకవిషయము లో మనవారు గ్రహింపగలరు. 'జగదీస్ చంద్రబోసు' అను గొప్ప శాస్త్రజ్ఞుడొకఁడు కలకత్తాలో నుండెను. ఈయన భార్య "లేడిచంద్రబోసు". యౌవనముననే యీమె తల్లి మర ణించెను. అప్పటికాలములో నాసకుటుంబమునకును, దాసుకుటుం బయునకు బాంధవ్యమునకన్న స్నేహభావ మధికముగా నుండె ను. తల్లి చనిపోయిన వెంటనే లేడీచంద్రబోసు తనసోదరులతో పాటు దాసుయింట కొంతకాల ముండెను. వీరిని దాసుతల్లి తనకుమారులకన్న మిన్నగా ప్రేమించి, వీరి కట్టిలోపమును జరుగకుండ మిక్కిలి గారాబముతో బెంచి పెద్దవారిని చేసెను. తరువాత 'లేడీచంద్రబోసు' ఆమెనుగూర్చి గొప్పగా వ్రాసెను. అంతటి పవిత్రురాలైన స్త్రీని తల్లిగా బడయుటచే చిత్తరంజన్ గొప్పఅదృష్టవంతుడని చెప్పవలసియుండెను. దిక్కులేనివారిని బీదవారిని జూచిన ఆమెకు జాలికలిగి వారిని యాదరణ చేయు చుండెడిది. వారికష్టసుఖములు నరసి వారిని కాపాడుచుండును. దానము చేయుటలో నామెకు యెదురు లేదు. ధర్మకార్యము

లన్నను, దైవకార్యములన్నను, తప్పక ధనమును వెచ్చించి కార్యసాఫల్యము చేయును. కాని బాలమితభాషిణి అనవసరమైన కార్యములకు బోక నిష్కపటమైన హృదయముతో ప్రవర్తించుచుండెను. కుటుంబములో నున్నవారందరిని వారి కోరికలను తీర్చి యానందింప జేయుచుండెను. భర్తయందు ప్రేమ యధికము. భర్తృసేవయే పరమార్థముగను అటువంటి భార్యాభర్తలకు జనించిన కుమారుని యొక్క స్వాభావికగుణము లెట్లుండునో గ్రహించుము! సామాన్యమైన గృహసంపన్నత కలిగి చిన్నగ్రామములో సుఖజీవనము చేయుట, అయినను భార్యాభర్తలు గొప్ప యన్యోన్యభావమును కలిగియుండుట! ఉదారస్వభావము కలిగిప్రజలనాదరించుట ఇటువంటి దంపతులకు చిత్తరంజన్ దాసువంటి కుమారుని కన్నా పుత్రభాగ్యముకన్న గొప్ప దృశ్యమేమున్నది! తల్లిదండ్రులగుణము లన్నియు పుత్రునందులో నిమిడియున్నవి. జననీజనకులే యాతని మొదటి గురువులు. మఱి యొకవిశేషమును గ్రహించుము. చిత్తరంజన్ తండ్రి భువనమోహన్ దాసు గొప్పకవి. ఈయనకు సాహిత్యాభిలాష యధికముగా నుండెను బ్రహ్మసమాజసంబంధమైన గీతములు వ్రాయుచుండెను. సమాజమునకు వచ్చినవారందరు గీతములను పాడుచుండుదురు. ప్రార్థనగీతములు, పద్యములు అనేకభావములలో వ్రాయగల శక్తి ఆయనకు గలదు. ఈగీతము ప్రచురణలోనుంచి ప్రచారములో బెట్టెను. ఈవిధముగా సమాజమును వృద్ధిచేసెను.

తండ్రియొక్క కవిత్వధోరణి చిత్తరంజనునకు బట్టుబడెను. ఈయనకూడా చిన్నతనములో మంచి శైలిలో రమ్యమైన పద్యములను గీతములను వ్రాయగలిగెను. కాని దీనిని చివఱవరకు వృద్ధిచేయక మధ్యమార్గములో వదలివేసెను. ఇందులకై ఈయనను కవియని చెప్పుటకు వీలులేకపోయినది. కాని యిప్పుడిప్పుడీ కవిత్వధోరణి వచ్చుచుండెడిది. అది సామాన్యముగానే పోయెడిది. కాని చిన్నతనమునుండియు విద్యావంతులతో దిరుగుటచేతను చిత్తరంజన్ వాగ్ధాటి అధికమయ్యెను. బహిరంగమైన ఉపన్యాసముల నలవరచెను. మంచి గంభీరమైన స్వరముతో బహువ్యాపకముగా మాట్లాడుట కలవడెను. ఇతని యుపన్యాసములు వినుటకు యువకు లెగబడెడివారు. ఇతనికి పదునొకండు సంవత్సరముల ప్రాయములో 'లార్డురిప్పన్' సన్మానము చేయుచుండ, రాజకీయములలో పనిచేయుట ప్రారంభించెను. ప్రపంచములో పేరుపడిన పత్రికలను చదువుటచేతను, నాయకులవిధానములను గ్రహించుటచేతను, అనుభవనీయులైన విద్యావంతులతో దిరుగుటచేతను చిత్తరంజన్ తనవయస్సునకు మించిన మహత్తరమైన కార్యములలో పనిచేసి పేరుప్రతిష్టలను సంపాదించెను. గొప్ప దేశోద్ధారకుల యభిప్రాయములనేగాక వారిశక్తినికూడ సంపాదించెను. తన అనుభవనీయమైన విషయములను వృద్ధిచేసెను. దేశములో నే ప్రాంతములలో మహత్తరమైన శక్తివంతు లుండిరో వారియొక్క పరిపూర్ణ విధానమును గ్రహించెను.

శ్రీచిత్తరంజనదాసు 1878 సంవత్సరములో బాలశాలలో ప్రవేశించెను. ఇదియే సరియైన విద్యాప్రారంభమన్నమాట. ప్రవేశపరీక్షలో 1886 సంవత్సరమున నుత్తీర్ణుడై ప్రెసిడెన్సీకాలేజీలో బ్రవేశించెను. హైస్కూలులో జదివినంతకాలమును ప్రతిక్లాసులోను మొదటివాడిగా వచ్చుచు నుపాధ్యాయుల మెప్పు వడసెను. ఒకక్లాసునుండి మఱియొకక్లాసులోనికి వచ్చుసరికి కితనికి విద్యయందు దగ్గలాష యధికమై మిక్కిలి యుత్సాహముతో విద్యను పూర్తిచేసెను. ప్రసిడెన్సీకాలేజీలో నుండగా కొంతమంది విద్యార్థుల నొకసంఘముగ నేర్పఱిచి దానికి తాను ప్రసిడెంటుగా నుండి సంఘకార్యములను నడుపుచుండెను. బెంగాలీభాషకు ప్రాధాన్యత మీయవలెనని యత్నములజేసి ప్రారంభించెను. అప్పుడు 'సర్ విలియమ్ హంటరు' విశ్వవిద్యాలయమునకు వైస్ ఛాన్సలరుగా నుండెను. ఇతడు వై తీర్మానమునకు కట్టుతగిలి యీకార్యమును నిష్ఫలము చేసెను. తరువాత వైస్ ఛాన్సలరు 'డాక్టరు గురుదాస్ బెనర్జీ'. బెంగాలీభాషను ప్రాథమికభాషగా జేయుటకు గొప్ప ప్రయత్నము చేసెను. గాని విఫలమనోరథుండయ్యెను. ఈ ముసలితరువాత 'సర్ అషుటోషముకర్జీ' వైస్ ఛాన్సలరు అయ్యెను. ఈయన విద్యావంతుండును, కార్యదీక్షాపరుండగుటచే 1912 సంవత్సరములో బెంగాలీభాషను పైకి దీసికొని వచ్చెను. విద్యార్థులయొక్క సహాయమువలనను ముఖర్జీ ప్రభుత్వముతో బోరాడి బెంగాలీ భాషకు ప్రాధాన్యత నిచ్చునట్లు చేసెను. అప్పుడు బెంగాలు

దేశములో నున్న పత్రికలందరును ముఖర్జీని మిక్కిలి కొనియాడిరి. ఇట్టిసమయములో 'సురేంద్రనాథ్ బెనర్జీ' అనువతడు విద్యార్థి సంఘమునకు ప్రసిడెంటుగా నుండెను. ఈయన ఇండియన్ సివిల్ సర్వీసునుండి తొలగింపబడెను. ఇతను గొప్ప దేశాభిమాని. ప్రపంచజ్ఞానము కలిగినవాఁడు. దేశసేవ చేయుచు యువకులను దానిలో పెట్టుటకు ప్రయత్నము చేసెను. విద్యార్థిసంఘములకు తఱచు నుపన్యాసము లిచ్చుచుండెను. ఈసందర్భములో కలకత్తాలో గొప్పసభలనుండి ముఖ్యముగా విద్యార్థులకే యుపన్యాసము లిచ్చెను. దేశాభిమానము, దేశసేవనుగూర్చి విద్యార్థుల కావేశము కలిగించెను. అప్పుడు చిత్తరంజనదాసు బెనర్జీ ప్రసంగమును దగ్గరగాకూర్చుని అతనిపాఠములన్నిటిని శ్రద్ధగా విని వాటిసారాంశములను గ్రహించెను. అప్పటినుండియు దేశము నుద్ధరించుట యెట్లను సమస్య దాసును బాధించుచునే యుండెను. అవకాశమునకై వేచియుండెను. కాని తనవిద్య నింకను పూర్తిచేయవలెనను అభిలాష కలిగియుండెను. 1890 సంవత్సరములో పటపరీక్షలో నుత్తీర్ణుడై కాలేజీవిద్య పూర్తి కాగానే విద్యార్థిసంఘమును వదల వలసివచ్చినది. సంఘమును వృద్ధిచేయుటకతనికి నావకాశము లేక యితరులకై వదలివేయెను. అనప్పు పూర్తిచేయవలెనని మరల చదువును ప్రారంభించెను. కాని యితరకార్యములందు నిమగ్నుడై చదువునందు శ్రద్ధ వహింపలేదు. ఈకారణముచే కృతార్థుడు కాలేకపోయెను. మరల చదువుటయూ, లేక విరమించుటయూ

యని తనలో వితర్కించుచున్న సమయములో తండ్రియగు మోహనదాసు కుమారుని విషయమున శ్రద్ధ తీసికొని అతనిని యింగ్లండునకు ఐ. సి. యస్. పరీక్షకు పంపెను. చిత్తరంజనుడు సీమదేశమునకు వెళ్ళి పరీక్షలకు చదువుచుండెను. 1892 సం॥ త్సరములో చిత్తరంజనుడు పరీక్షలో నుత్తీర్ణుడు కాలేదు. దీని కారణ మతనికి పరీక్షలో సమర్థత లేక కాదు. న్యాయముగ నతడు పరీక్షలో అందరికన్న ప్రథమునిగా నుండవలసినదే చెప్పవలసియున్నది. కాని యతడిక్కడ గాలియుపన్యాసము లిచ్చెను. అతి తీవ్రమైన ఉపన్యాసముల నిచ్చుచు నింగ్లండులో నున్న హిందువులకు దేశాభిమానము కలుగజేసెను. మంచి ప్రసంగ కారుడు. ఇంగ్లీషుభాషలో విశేషమగు నాకర్షణగల మహత్తరమైన శక్తియున్నది. పూర్ణమైన విద్యావంతుడు. బాల్యము నుండియు లోకజ్ఞానమును లోకానుభవమును సంపాదించెను. ప్రియముకంటె తన్మైన దేశము. ప్రజాభిమానమైన కార్యములలో ప్రజలకు దేశాభిమానము కలుగజేయు ధాటిలో నుపన్యాసము లిచ్చుచుండు యువకునివంటివారికైనను మనస్సు గలిగింపకపోవునా? ముఖ్యముగ హిందూదేశములో పత్రికలవలన కొంతకాలమైన మార్పులు జరుగనున్నవని సీమదేశస్థులుకూడ గ్రహించిరి. ఇట్టికారణములచే నితనిని ఐ. సి. యస్. పరీక్షలో నుత్తీర్ణునిగా జేయలేదని యొకవదంతి. ఇది కొంతవరకు యథార్థమై యుండ వచ్చును. దాదాభాయి నౌరోజీ మొదలగు మహామహులను గూర్చి సీమలో నుపన్యాసము లిచ్చుచు అట్టివారిని కొనియాడు

సభలో నుండుట కర్తవ్యులని గట్టిగా జెప్పెను. ఓల్బుహామ్ భవనములో నొకనాడు గొప్పసభ జరిగెను. ఈసభకు డబ్ల్యు యిగ్లేడస్టను అధ్యక్షపదవి వహించెను. అప్పుడు చిత్తరంజను డొక గొప్ప యుపన్యాస మీవిధముగా నిచ్చెను.

"ఆంగ్లేయులు హిందూదేశమును కత్తితో సాధించి బ్రిటిషుసామ్రాజ్యమును స్థాపించితిమి. కాబట్టి కత్తిసాధనములోనే సామ్రాజ్యమును నిలువవలెను." అని వ్రాయుచుండిరి. స్నేహధర్మములో వెండటు వర్తకరీత్యా హిందూదేశమునందు ప్రవేశించి క్రమముగా సామ్రాజ్యము నెలకొల్పిరి. కాబట్టి యీవిధముగా వ్రాయుట ఆంగ్లేయుల నీచబుద్ధిని వెల్లడిచేయునట్లగును. దీనిని సవరించుకొనుట చాలమంచిది."

ఐ. సి. యస్. పరీక్ష పోయినవెంటనే బారిష్టరుపరీక్షకు చదివి 1893 సంవత్సరమున హిందూదేశముc జేరెను. ఇండియాకు వచ్చిన వెంటనే కలకత్తాహైకోర్టులో ప్రాక్టీసు మొదలుపెట్టెను. కాని అసమయములో సతనికి సలహా చెప్పుటకు తండ్రి యుద్యమునుండి విరమించిగృహమందు విశ్రాంతి గైకొనుచుండెను. మిగిలినవారు శ్రద్ధవహించలేదు. పెద్దలాయర్లు అనేకమందీ చాలసంవత్సరములనుండి హైకోర్టులో బనిచేయుటచే వారిదగ్గర దాసు మొదలగు క్రొత్తగా వచ్చినవారికి అవకాశము కలుగుట లేదు. చాలకష్టముగా దాసునకు కనుపించుచున్నది.

ఎంతకాలమునకు పైకి రావలసియుండునో దాని కెంత శ్రమ పడవలసియున్నదో ముందు భవిష్యత గోచరముగా నున్నదని చిత్తరంజనుడు గ్రహించి 1895 సంవత్సరములో గొన్ని నూతనగ్రంథములను వ్రాయుటకు మొదలిడెను. మొదటిగ్రంథమును పద్యకావ్యముగా వ్రాసెను. ఇట్లు కొంతకాలముగ్రంథరచనము గావించి రాజకీయములో దిరుగుచుండెను. తండ్రికాలమునుండియు కవిత్వమును విడువక సాధనము చేయుచున్నచో నిప్పటికి జగత్ప్రఖ్యాతి వడసిన కవియై యుండవలసినది. సహజముగ మేధాశక్తిగలవాడుగాన నీయనగ్రంథరచనలు సొక్కముగాను మృదుమధురముగానే యుండెడివి. ఎక్కువశాంతముతోను యోర్పుతోను చాలకాల మిట్లు కాలక్షేపము చేసి యెప్పటికైనను తాను తలంచినవృత్తియందవకాశముకలుగునని వేచియుండెను.

ఇంతకాలమువరకును చిత్తరంజను డవివాహితుడై యుండెను. ఇంతకాలము నతనిప్రవర్తనములో నెట్టి లోటుపాటులును లేవు. వివాహవిషయములో స్నేహితులును, బంధువర్గమును తొందర జేయగా నంగీకరించి 1897 సంవత్సరములో డిశంబరు మూడవ తేదీని బ్రహ్మసమాజమున సంస్కరణప్రకారము అస్సాముదేశములో 'బిజ్ని' యెస్టేటుదివానుగా నున్న 'బారదనాద్ హాల్దర్' పెద్దకుమార్తెయగు 'బసంతీదేవిని' వివాహ మాడెను. బారదనాద్ హాల్దర్ బ్రహ్మసమాజమున కనుకూలుడైనవాడు. అతనికుమార్తెయు విద్యావంతురాలు. మంచి

కౌదార్యమైన గుణములు గలది. చిత్తరంజనకు దగిన దాంపత్యము కుదిరి కుటుంబసౌఖ్యము కలిగెను. దైవభక్తిలోను దానధర్మములలోను 'బసంతీదేవి' చిత్తరంజనుమాతకు దీసిపోదు. భార్యాభర్త లిద్దరును అధికదానవంతులు. వీరు తెలియని దానము చేసెడివారు. లక్షలమీద రాబడియున్నను, దంపతులయొక్క అమితయీవిచే సంసారమునకు శాశ్వతమైన నిలువలేకపోయెను. వారికుటుంబములో బరిచయమున్నవారికే గాని యితరుల కీవిషయ మంతగా దెలియదు. తిండిలేనివారికి బీదవిద్యార్థులకు మఱియు కొన్నిబీదకుటుంబములకును వీరు చేసిన ధనోపకారమునకు మితము లేదు. ఇక్క డొకవిషయమును వ్రాయుచుంటిమి. చిత్తరంజనుతండ్రి భువనమోహనదాసు పూర్వాచారపరాయణుడు. అమితమైన ధనమును గడించి బీద స్థితిలో నున్న తనబంధువులకు వ్యయపఱచెను. తనకు స్థితికి మించిన కార్యములను జేసి అప్పులపా లయ్యెను. అప్పుబాధ అధికముగా నుండుటచే దనవృద్ధాప్యములో ఇన్‌సాల్వెన్సీకోర్టునకు బోవలసివచ్చెను. చిత్తరంజనుడు ఇంగ్లండునుండి ఇండియాకు వచ్చినవెంటనే కలకత్తాహైకోర్టులో ప్రాక్టీసు ప్రారంభించెను. రాజకీయములో బూర్తిగా బనిచేయుట కాయనకు తండ్రిచేసిన అప్పులనుగూర్చి చాల మనస్సంతాపము కలిగెను. జనకుని అప్పులు దీర్చినగాని యాయనకు మనశ్శాంతి కలుగదని దీక్ష వహించెను, ఇది పితృవాత్సల్యమేగా కిది తండ్రి కవమానకరమైన విషయమని గ్రహించెను. ఇట్టి సంసారబాధలే

లేనిమొదల చిత్తరంజను డప్పటికే గొప్ప దేశనాయకుడై యుండవలసినది కాని చాలకాలమువరకు హైకోర్టువని యుపయోగకరము గాలేదు. హైకోర్టువదలి దగ్గరగానున్న పట్టణములోనికి బోయి క్రిందకోర్టులో ప్రాక్టీసు చేయుట కభిప్రాయము కలిగెను. ఇట్టి సమయములో శ్రీ జత్ అరవింద ఘోషుపై గొప్పకుట్రకేసు బయలుదేరినది. ఘోషుతరఫున చిత్తరంజనుడు గొప్పపని చేసెను. దీనితో దాసునకు కలకత్తా హైకోర్టులో మంచిపేరు వచ్చెను. ఏకదీక్షగా ఆరుమాసము లీకేసులో పనిచేసి తమకు జయము గాంచెను. కాని యీకేసులో గడించిన ధన మితనిగృహఖర్చులకుగూడ సరిపోలేదు. అప్పటినుండియు హైకోర్టులో చిత్తరంజనునకు గొప్పప్రాక్టీసు ప్రారంభ మయ్యెను. ధర్మమార్గమున ప్రవర్తించువానికి దైవసహాయము లభించునని గీతలో భగవానుడు చెప్పెను. క్రమముగా చిత్తరంజను రాబడి అధిక మగుచుండెను. వెంటనే తండ్రిచేసిన అప్పులన్నియు దీర్చి ఆయనకు శాంతిని కలుగజేసెను. ఇట్టివిషయమునకు హైకోర్టు న్యాయాధిపతికూడ యాశ్చర్యపడెను. ప్రజల కొకవిధమగు ప్రేమ జనించెను. దాసుయొక్క ధర్మబుద్ధిని వారు గ్రహింప కలిగిరి. ఇప్పటికి చిత్తరంజనునకు గూడ మనోధైర్యము కలిగెను. ఇక రాజకీయములో బని చేయుట మొదలిడెను. కాని లాయరుమింటో గావించిన తీర్మానమున విచ్చలవిడిగా రాజకీయములో వ్యవహరించుటకు వీలు కాకపోయినది. 1915 సంవత్సరలో 'నారాయణ' అను నొకమాసపత్రి

కను ప్రారంభించెను. దీనికి మహామహోపాధ్యాయహరప్రసాద శాస్త్రి బాబుబెపిన్ చంద్రపాల్ మొదలగువారు ఘనమైన వ్యాసములను వ్రాయుచుండిరి.

చిత్తరంజన్ పత్రికను పూర్తిగా బెంగాలీభాషలోనే నడపుచుండెను. ఈయన కీభాషయందు మిక్కిలి అభిమానము. 1894 సంవత్సరమునుండి 1895 సంవత్సరమువరకును చిత్తరంజను డీభాషలో గ్రంథములనువ్రాసెను. 'మలంచ' అను గ్రంథములో పద్యకావ్యమును వ్రాసెను. ఇది ప్రజలయొక్క జీవితస్వాతంత్ర్యమునుగూర్చి తెల్పుచున్నది భాషాపరిజ్ఞానమును అధిక ప్రచారణమువలన అభివృద్ధి చేసెను. అప్పుడు కలకత్తాలో బెంగాలీ లిటరరీసొసైటీయనునొకదానిని నియమించి దీనికి దాసును అధిపతిగా జేసెను. దీనిసంబంధమైన అన్నిసభలకును చిత్తరంజనుడే సభాధిపత్యమును వహించెను. అప్పటికాలములో రవీంద్రనాథటాగూర్ బెంగాలీభాషలో గ్రంథములను వ్రాయుచుండెను. ఈభాషలో నగగణ్యుడని యనుపించుకొనెను. సనాతనాభిప్రాయము లేగాక ప్రపంచమున కనుగుణముగా నున్నప్రస్తుతనవనాగరికమునకు సరిపోవు అభిప్రాయములలో బెంగాలీభాషలో రవీంద్రుడు గ్రంథరాజములను వ్రాయుచుండెను. చిత్తరంజనుడు వీనికి సరియగు నభిప్రాయములనుచక్కగా సంపుటించియు తరువాత క్రమముగా వాటిని మార్చుకొనెను. భాషాభివృద్ధిలో శ్రద్ధను వహింపక రాజకీయములోనికి తన వృత్తిధర్మమునందును బుద్ధిని మరల్చెను.

చిత్తరంజనుడు తన ప్రాక్టీసు అధికమైన వెంటనే కుటుంబ బాధలను తొలగించి తండ్రికి మనశ్శాంతిని కలిగించెను. సాధారణముగా నింగ్లండునకు వెళ్ళి పదవులను పొంది తిరిగి హిందూదేశము వచ్చినవారు చాలమంది కుటుంబములను వదలి ప్రత్యేకజీవనము చేసినవారిని మన మెందరినో చూచియుంటిమి. దేశనాయకులలోగూడ కొందర ట్లు గావించిరి. స్వలాభాపేక్ష యధికమై, తలిదండ్రులను మఱచి, కుటుంబముతో సౌఖ్యముగా నున్నచాలునను దురభిప్రాయముతో నట్లు గావించిరి. కాని చిత్తరంజనదాసు యట్లుగాక పితృవాక్యపరిపాలనమే తనకు కర్తవ్యమనియు, మాతాపితల సౌఖ్యమే తనకు మనశ్శాంతి నిచ్చుననియు మనఃపూర్వకముగా గ్రహించి కుటుంబసౌఖ్యము కొఱకు పాటుపడెను. అదియునుంగాక యితడు సోదరసోదరీమణులనుకూడ విడనాడి యుండ లేదు. తన జ్యేష్ఠసోదరుని ప్లీడరువృత్తిలో ప్రవేశపెట్టి అతని కన్నివిషయములలోను సహాయముగా నుండెను. కనిష్ఠసోదరుని యింగ్లండునకు పంపి విద్యను గఱపి అభివృద్ధిలోనికి దీసికొనివచ్చెను. భర్తృవియోగము కలిగిన సోదరీమణులు తనగృహమందే యుండెడివారు. వీరందరును సౌఖ్యముగాను, స్వేచ్ఛగాను జీవనము చేసిరి. చిత్తరంజను డెప్పుడును వారిని పల్లెత్తుమాటనుకూడ ఆడి యుండ లేదు. కుటుంబములోనవారిని, బంధువులను సమభావముతో జూచెను. ఇంకను అనేకమంది మిత్రులను ఆపదకాలములో గాపాడెను. ధనసహాయము చేసెను.

చిన్నవయస్సులోనే చిత్తరంజనుడు బెంగాలుదేశము నకు ప్రధాననాయకు డయ్యెను ఇతనిదేశాభిమానము అపారము. ధర్మకార్యములందు దాసక్తి గలవాడు. ఇతనిమేధాశక్తి కంతు లేదు. స్వయమన్న దేమియో నీతనికి దెలియదు. తన ఆత్మయొక్క ప్రకాశమైన జ్యోతినిబట్టి నిధానముగా ధర్మ కార్యములను జేయువాడు దేశసేవయే యితనికి ప్రాధాన్యము. అందును తనస్వవిషయము నెప్పుడును చూచుకొనలేదు. దేశ సేవ దేశముకొఱకే యని యితనియభిప్రాయము. ఇత డేవిష యములో నెవరినిగాని కోటియుండలేదు. ఇతనికి స్వాతంత్ర్య జీవన మన్న యెక్కువ అభిమానము. భీతిలేక యెంతటివారి యెదుటనైన నిశ్చయమైన హృదయముతో మాట్లాడగలడు. నైసర్గికముగా నితడు పదిమందిలోను విచ్చలవిడిగా దిరుగు వాడుకాడు. కాని యితనిలోనున్న గొప్పగుణములు విశేషము ఇతనిని ప్రపంచమునకు వెల్లడిచేసి వృత్తిలోను రాజకీయములో కూడ ముందంజవేయించెను. ఇతనిధనార్జనమునకు మితము లేదు. అంతకు రెట్టింపు వ్యయపఱచెను. అంతయు సద్వ్రిని యోగమేగాని దుర్వినియోగ మెంతమాత్రమును లేదు. ఇతడు చేసిన దానధర్మము లపారము. ఈవిషయము మన కంతగా దెలియదు కష్టములో నున్నవారిని జూచి యితడు సహింపలేదు. వెంటనే వారిబాధలను తొలగించినగాని తనకు మన శ్శాంతి కలుగదు. 'పరోపకారార్థ మిదం శరీరం' అను జన వాక్యము ననుసరించినవాడు.

దేశ సేవయు దేశాభివృద్ధియు నుత్తములమీద నాధార పడియుండునని యితని యభిప్రాయము. ఇతడు విద్యార్థిగా నున్నప్పటినుండియు తనసహాధ్యాయులకేయుద్రేకము కలిగించు నుపన్యాసముల నిచ్చుచుండెడివాడు. 1921 సంవత్సరము జాన్యువరి 21 తేదీని ఒకగొప్పవిద్యార్థిసమావేశము కలకత్తాపట్టణమందు మీర్జపూర్ స్క్వేర్‌లో జరిగెను. అప్పుడు మహాత్ముడు విద్యార్థుల కొరకు ఉపన్యాసమిచ్చిన తరువాత శ్రీచిత్తరంజనదాసుని మాట్లాడుమని విద్యార్థులు కోరగా దాసు యీరీతిగా మాట్లాడెను. "యువకులారా! సోదరులారా! ఈక్షణమున మీరు చేయవలసిన విధి యొక్కటున్నది. మీరందరును కాలేజీలను వదలి యిక్కడ సమావేశమైతిరి. తిరిగి మీరు కాలేజీలలో బ్రవేశించినచో బెంగాలు దేశ మంతటికిని యపకీర్తి తెచ్చినవారగుదురు. ఈయుద్యమము (నాన్‌కోపరేషన్) యొక్క జయాపజయములు మీచేతులలోనున్నది. ఇదివరలోనే నిదియే చెప్పియుంటిని. ఇప్పుడుకూడ నీవిషయమునే నొక్కివక్కాణించుచుంటిని. ఇప్పుడు మాముఖ్యోద్దేశ మేమన—విద్యార్థులు కాలేజీలను పాఠశాలను వదలివేయవలెను. ఉద్యోగముచేయువారు వారిపదవులకు రాజీనామా నీయవలెను.

సమస్తమైనన గవర్నమెంటు ఆఫీసులను వీడి ఉద్యోగులు బయటకురావలెను. దేశమాతకు సేవచేయవలెను. ఇందు ముఖ్యా

ముగా మాకు కావలిసినది మీబోటియువకులు. కాలేజీలను పూర్తిగా మానుకొనవలెను.

కలకత్తా యూనివర్సిటీ స్వదేశసంబంధమైనదని యెవ రైన చెప్పినను మీరామాటలను విశ్వసింపవద్దు. కాలేజీలలోను యూనివర్సిటీలోను పనిచేయు నుపాధ్యాయులనుబట్టి మనము తీర్మానము చేయరాదు. అందు పనిచేయువారు హిందువులు కానీ తదితరులుకానీ ఈవిచక్షతతో మనకు బనిలేదు. అది ప్రస్తుతప్రభుత్వముతో సంబంధము కలిగియున్నదా లేదా? అనువిషయమే మనకు గావలయును. వీరు మిమ్ములను తప్పు దారిలో బెట్టెదరు. తప్పభిప్రాయములను బోధించెదరు. ఏకాలేజీయైనను కట్టినవారితో నిమిత్తము లేదు. ప్రవేశించి పనిచేయువారితో నిమిత్తము లేదు. ఏప్రభుత్వవిధానములో నది నడచుచున్నదను విషయమే మనకు గావలెను; ఇక్కడకు కొంతదూరములోనున్న యూనివర్సిటీ మనకు స్వారాజ్యము వచ్చుటకుముందే అడుగంటవలసియున్నది. ఇట్లు జరుగుటకు మీరే కారకులై యుండవలెను. ఈవేళటిరోజున మీరు మీకాలేజీలను వదలివచ్చినందువల్ల ప్రయోజనము లేదు. దీనిని పొడిగించి దీనిఫలితమును గమనింపవలయును.

ప్రస్తుతము మన కార్యాన్వేషణమునకు స్వదేశీ యూని వర్సిటీ మనకవసరము కాదు. అట్టిది అవసరమని మీబుద్ధికి

తోఁచినచో ఆపనియు మీచేతులలోనే యున్నది. అట్టినేషనల్ యూనివర్సిటీని నిర్మించెదనని నేను మీకు వాగ్దాన మిచ్చు చున్నాను. నామాటయందు మీరు విశ్వాసముంచవచ్చును.

నేను చేయుకార్యమున కెవరును అడ్డురాలేరు. నావాగ్దానమును నేను నెఱవేర్చగలను. నేను నావాగ్దానమునునిలబెట్టుకొన కలుగుదునను విశ్వాసము మీకున్నచో మీరుకూడ మీ వాగ్దానమును నిలబెట్టుకొనవలెను. నేను ప్రస్తుతము రెండు తరగతుల విద్యార్థులనుగూర్చి మాట్లాడుచున్నాను. అట్టివారి పేర్లను నేను వ్రాసికొనుచుంటిని. ఇందు మొదటితరగతి దేశ సేవ చేయువారు. రెండవతరగతివారు రాట్నముమీద పని చేయువారు. మహాత్ముడు అనాదికములోనున్న చర్కాను బయటకు దీసికొనివచ్చెను. ఇదియే మనకు మోక్షము నిచ్చు నది. నేను నేషనల్ కాలేజీ నిర్మించినట్లైతే చర్కా నుపయో గించి దారమును వడకుట నేయుట ముఖ్యమైన పాఠములని తెలిసికొనుడు. మిగిలినవారికి విద్యకూడ నేర్పింపబడుచు మీ రందరును సంసిద్ధులై యున్నప్పుడే నేను ప్రయత్నమును చేయ గలను.

కాని మీరు లేనప్పుడు నే నేమియు చేయజాలను. మీబలముమీద నే నాధారపడియుంటిని. మీరు మీమనో ధైర్యమును చూపకలిగినపుడు నాకు కొన్నిలక్షలప్రజలయొక్క బలము చేకూరును.

నేనెవరినని నాలో నేను ఆలోచింపగా యువకులబలము మీద నాధారపడి యుంటినని గ్రహించుచుంటిని. మీకొఱకు పాటుపడుటకై నడుము కట్టుకొనియుంటిని. విద్యనేర్చిన ప్రయోజనము లేదు. ప్రస్తుతము మీరు నేర్చుకొనువిద్య బానిసత్వమును బలము చేయుచున్నది. గౌరవహీనమైన విద్య నభ్యసించుచుంటిరి. స్వాతంత్ర్యశక్తి నశించుచున్నది. వ్యసనములందు దగుల్కొనుచుండిరి. ధనమును దుర్వినియోగము చేయుచుండిరి. మేము ప్రారంభించు విద్యలో వీటి కేమియు నవకాశము లేదు. హిందూదేశమునకు దగినట్లును ధర్మమార్గమున నడపగలము. దుర్వ్యసనముల చేయుట కవకాశము చిక్కదు.

మాతృసేవకు మార్గ మేర్పడును. పాశ్చాత్త్యుల అభ్యాసములన్నియు తగ్గిపోవును. మేము తయారుచేయు నేషనల్ కాలేజీలో 8 9 సంవత్సరముల ప్రాయముగల బాలురు ప్రవేశింపవచ్చును. 4 5 సంవత్సరములకన్న ఎక్కువవిద్య నభ్యసింప నవసరము లేదు. అప్పుడు నిజమైన హిందువు లనిపించుకొని దేశసేవ చేయనగును. అపరిచయములో బలవత్తరమైన సామ్రాజ్యముతో బోరాడుచుంటిమి. చాలగట్టిప్రయత్నములను చేసినగాని యుద్యమమును సాగింపలేము. జయము చేకూరుట చాలకష్టమై నట్లుగుపించినను నిశ్చయముగా జయప్రదము కాగలదు. దీనికి మనమనస్సే ప్రధానము. మనపట్టుదలయే ముఖ్యము. ఖిమ్మూల నందటిని నేనొకవిషయమును

కోరుచున్నాను. ఒక్క సంవత్సరము పూర్తిగా మీరు విద్యను కట్టిపెట్టి స్వరాజ్యముకొఱకు ప్రయత్నము చేసినచో మీ శ్రమకు ఫలితము తప్పక యుండును. ఇది మీ విధియై యున్నది.

మీ ఆత్మపూర్వకముగా మీరే గ్రహింప కలుగుదురు. మీరందరును ముందంజవేయవలెను. మనము చేయు నుద్యమములో కాఠిన్యము పనికిరాదు. నిర్మలత్వము కలిగియుండవలెను. ఇది దౌర్జన్యరాహిత్యమైనయుద్యమమని మీరు గ్రహింపవలెను. మీరు మరల మీ కాలేజీలలో ప్రవేశించిన యెడల మీరు పిఱికిపందలనియు నీయుద్యమమున కనర్హులనియు గట్టిగా నొక్కి చెప్పుచున్నాను. మీరీ విషయములు జాగ్రత్తగా విచారింపుడు. మీ ఆత్మయే మీకు సాక్షి. మీ విధిని మీరు నెఱవేర్చినచో దేశమాత సంతోషించి మీ కాలింగన మిచ్చును. ఇది సంపూర్ణస్వరాజ్యచిహ్నమని గ్రహింతురుగాక!”

ఇటువంటి తీవ్రమైన ఉపన్యాసములను సమయము చిక్కినపుడెల్ల చిత్తరంజనుడు విద్యార్థుల కిచ్చి వారి కుద్రేకము కలిగించువాడు. పై ఉపన్యాస మిచ్చినపుడు చాలమంది విద్యార్థులు కాలేజీలను బహిష్కరించి యుద్యమములో జేరిరి. చాలమంది ఉద్యోగస్తులు వారిపనులనుండి విరమించిరి. 1921 సంవత్సరములోనే నాన్‌కోఆపరేషన్ ముమెంటు ఒక పెద్ద కెరటమువలె దేశమునంతకు బ్రాకెను. ప్రజల నందఱి

మనస్సును కదల్చి వారిస్థానములనుండి కూడ మరల్చెను. 1857 సంవత్సరములో బయలుదేరిన తిరుగుబాటు తప్ప మరల నిట్టియుద్యమ మెప్పుడును రాలేదు. నాటికీ నేమ మహాత్ముడు స్థాపించెను. ఇదియే కాంగ్రెసు. కాంగ్రెసు న్యాయవాదులను కోర్టులకు బోవద్దనియు, టైటిలున్నవారు వాటిని వదలివేయు మనియు, విద్యార్థులను కాలేజీలను బహిష్కరింపమనియు, గవర్నమెంటు సేవకులను రాజీనామా లీయమనియు, ఘోషీం చుచుండెను. ఈసమయములో టాగూరుమహాశయుడు తన నైట్‌హుడ్ వీడెను. చిత్తరంజనదాసు కోర్టునకు వెళ్లుట మాను కొనెను. నెలను కొన్నివేలరూపాయల ఆదాయముగల వృత్తిని వదలుకొనెను.

వేలకొలది విద్యార్థులు కాలేజీలను వదలి బయటకు వచ్చిరి. ఈసమయములలో సుభాస్‌చంద్రబోస్ ఐ. సి. యస్. పూర్తిచేసి కలక్టరుపదవిలో నుండెను. చిత్తరంజనుడు చేయు ప్రచారములో నతడు నిమగ్నుడయ్యెను. మహాత్మునియొక్క ఉపన్యాసములను విని చెదరిన మనస్సు గలవాడయ్యెను. ఇతనియొక్క సందిగ్ధావస్థను జూచి కుటుంబములోనివారును స్నేహితులును తనపదవికి రాజీనామా నీయవద్దని బ్రతిమాలిరి. ఒకనాడు సుభాస్ నిశ్చయమైన మనస్సుతో తనఉన్నతపదవికి రాజీనామా నిచ్చివేసెను. ఆరోజునుండియు సుభాసునకు చిత్త

రంజనుతో మైత్రి కలిగెను. క్రమక్రమముగా వీరిద్దఱకు నన్యో న్యత యధిక మగుచుండెను. సుభాస్ మాండలె జైలులో నుండగా దాసుయొక్క మరణవార్తను వినెను. అప్పటివరకును సుభాసు చిత్తరంజను నొకగురువుగా భావించుచుండెను. మరణ వార్త వినినవెంటనే యతడు నిశ్చేష్టుడై పోయెను. నవనాడులు కృంగిపోయినవి. మంచిధీరత్వము కలిగిన సుభాసంతటివాడు చిన్నపిల్లవానివలె నేడ్చెను. తనజీవితము నిరుత్సాహమైనట్లు గ్రహించెను. తాను చేయుప్రతియుద్యమములోను చిత్తరం జను అభిప్రాయము లేనిదే ప్రారంభించువాడు కాడు. అతని సహాయమే తనకు దైవనియోగ మనిపించెను. అట్టితరుణము తనజీవితములో నికరాదని గ్రహించి నిరుత్సాహు డయ్యెను. తనజీవితాశకు భంగము కలిగెను. తనపదవినుండి తొలగిన వెంటనే చిత్తరంజను డితనిని ప్రోత్సహించి నేషనల్ కాలేజీలో ప్రిన్సిపాల్‌గా నియమించెను. గయాకాంగ్రెసులో నితడు దాసును వెంటాడి యతనితో బాటు కౌన్సిలు ప్రవేశమునకు సమ్మతించెను.

ప్రతివిషయములోను దాసుచెప్పినదే తనకు వేద వాక్య మయ్యెను. చిత్తరంజనుడు కలకత్తాలో 'ఫార్వర్డు' అను నొకపత్రికను స్థాపించెను. తనఅభిప్రాయములను ప్రజలకు విపులముగా వెల్లడిచేయుట కితడు దీనిని ప్రచారములో బెట్టెను. ఈపత్రికకు సుభాస్‌చంద్రబోస్ సంపాదకుడుగా నుండి పనిచేసెను. 1924 సంవత్సరములో కాంగ్రెసుపార్టీ

జ్ఞయలులో నుండగా దాసు కలకత్తాకార్పొరేషనకు మేయ రయ్యెను. అప్పుడు సుభాసును ప్రధాన ఎక్జిక్యూటివ్ ఆఫీస రుగా నుంచెమని పట్టుపట్టెను. ప్రతికార్యములోను సుభాస్ అతనికి కుడిభుజముగా బనిచేయుచుండెను. వారిప్రేమానుబంధము దినదినాభివృద్ధి చెందుచుండెను.

ఇట్టిసమయములో నకస్మాత్తుగా దాసు చనిపోయెను. బెంగాలులో దాసుయొక్కడే గొప్పదేశసేవకుడు. ఇతరు లెవ్వరును లేరు. అదిసమయమునుండి తానే స్వయముగా కార్యాలోచనలు చేసి ప్రారంభించుచుండెను. సేన్‌గుప్తతో సుభాస్ కు చాలవైరములు కలిగి బెంగాలుదేశముయొక్క రాజకీయ పద్ధతులను మార్పు కలిగించినవి. ఇతరమైన కష్టములు చాలగా సుభాసునకు కలిగినవి. చిత్తరంజనుడే సజీవుడై యున్నయెడల యిట్టి కష్టములు రాకపోవును. దాసు వాటినన్నిటిని సమర్థించి యుండెను. సేనుగుప్త విషయములో దానే జయమును గాంచెను. దీని కితనిధీరత్వమును మనోనిశ్చయము లే కారణములైనవి. ఈమనోస్వభావము నితడు దాసునుండియే గ్రహించెను. చిత్తరంజనుడే యితనికి రాజకీయమైన విషయము లలో నెట్లు ప్రవర్తింపవలయునో బోధించెను. చిత్తరంజనుడు బెంగాలులో నిద్దరు ముగ్గురు నాయకులున్నగాని ప్రచారము నకు వీలుగానుండదనియు సుభాసు మంచిమేధావి యనియు గ్రహించి యతనిని రాజకీయములలో నుత్తీర్ణుని జేసెను.

1905 సంవత్సరములో బెంగాలు రాజప్రతినిధియగు మార్క్వెస్ కర్జన్ బెంగాలు దేశమును రెండు రాష్ట్రములుగా విభజించుటకు ప్రయత్నము గావించెను. తూర్పుబెంగాలు రాష్ట్రము, పశ్చిమబెంగాలురాష్ట్రమనియు విభజించి రెండు రాష్ట్రములకు నిద్దరు గవర్నరులను నియమించుట కేర్పాటు చేసెను.

దీనికి బ్రిటిషుప్రభుత్వము వా రంగీకరించిరి. ఈరాష్ట్ర విభజన ప్రజల కెంతమాత్రము నిష్టము లేదు. ప్రజలలో కోలాహలము బయలుదెరెను. ప్రతిచోటను సభలు జరిపి యీతీర్మానమును ఖండించుచుండిరి. 1905 సంవత్సరము ఆగస్టు యేడవ తేదీని ఆనరబుల్ మహారాజు సర్ మనీంద్ర చంద్రనుండి ఆధిపత్యముక్రింద గొప్ప సభను జరిపి రాష్ట్రవిభజన తీర్మానమును తీవ్రముగా ఖండించి విదేశవస్తువులను విసర్జించుటకు తీర్మానము సల్పిరి.

ప్రజలలో విదేశవస్తుబహిష్కారప్రచారము జరుగుచుండెను. ఈసమయములో యిదివరకు కాంగ్రెసునకు ప్రసిడెంటుగానున్న వాడును ప్రస్తుతము వృద్ధాప్యమువచ్చి జబ్బుస్థితిలోనున్న 'ఆనందమోహనబోసు' ను కలకత్తానుండి అప్పుడు సర్క్యులర్ రోడ్ ప్రాంతమునకు తీసికొని వచ్చి యతనిచే నక్కడొక రాతిని స్థాపింప జేసెను. ఈస్థలము రెండు రాష్ట్రములకునుమధ్య ప్రదేశము. ఇక్కడొక మందిరమును

గట్టి రెండురాష్ట్రములను నుపయోగించుటకు ప్రజలకభిప్రాయ ముకలిగెను.

ఈ రెండురాష్ట్రములు వేరుకావనియు, నొకటే రాష్ట్ర మనియు నీరాష్ట్రప్రభువుల కధికారము లేదనియు ప్రజలు ఘోషించుచుండిరి. ఎక్కడజూచినను అల్లర్లు, అధికముగా నుండెను. ప్రజలు రాష్ట్రప్రదేశములలో దిరుగుపాటు చేయు చుండిరి. చాలామందిమీాద ప్రభుత్వమువారు కేసులను బెట్టు చుండిరి.

ఇక్కడొక చిన్నవిషయమును వ్రాయుచుంటిని. సర్ జగదీస్ చంద్రబోస్ చిత్తరంజనుని బావమరిది. ఇతడు గొప్ప శాస్త్రవేత్త. వృక్షశాస్త్రమును పూర్తిగా జదివి దానిలో నమోఘమైన పరిశీలనచేయుచుండెను. నూతనమగు వృక్ష శాస్త్రసంబంధమైన విషయములను ప్రమాణములలు వెల్లడి చేయుచుండెను.

ఇతడు వృక్షములకు మనవలెనే హృదయముగలదనియు గుండెశబ్దము మనకువినబడుననియు అనుభవనీయమైన విషయ ములను ప్రత్యక్షముగా వ్రాసెను. దీనిని బ్రిటిషుప్రభుత్వ మంగీకరించయుండలేదు. దీనికికారణము బెంగాలులో జరుగు చున్న అల్లరులేయని గ్రహింపవలసియుండును. కాని జగదీస్ ప్రామాణికములుగా వృక్షములనుబట్టి తానువ్రాసినవిషయము

లన్నిటిని రుజువుచేసి బెంగాలుశాస్త్రవృద్ధిలో మొదటివిగా నున్నట్లు వెల్లడిచేసెను.

అప్పుడు దొరతనమువారుకూడ దీని కంగీకరించిరి. జగదీశ్, సి. సి. మొదలగు శాస్త్రజ్ఞులనేకులుగలరు. వీరు గొప్ప పరిశోధానశక్తికలవారు. కాని యిట్టి క్లిష్టసమయములో వీరి శాస్త్రప్రచురణాలకు సావకాశము లేకయుండెను. ప్రజలలో నమితమైన అల్లరులు సాగుచున్నవి. ఈ సమయములో నిందారోపణచేయబడిన వారందరకు, కోర్టులకు విచారణసమయము వచ్చినది. ఇందు కొంతమందికి చిత్తరంజనుడు పనిచేసి జయము గాంచుచుండెను. కేసులను మంచినిపుణతతో నడపుటవలన చిత్తరంజనునకు వృత్తిలోను, రాజకీయముగాను మంచికీర్తి వచ్చెను.

తన మేధాశక్తి నుపయోగించి న్యాయాధిపతికాచోక్ జిక్కకుండ కేసును వాదించుచుండెను. ఇతని వాగ్వాదశక్తి కందరును ఆశ్చర్యపడుచుండిరి. 1906 సంవత్సరములో ఆగస్టు 6 తేదీని వందేమాతరం బయలుదేరినది. దానిలో అరవిందఘోషుపై గొప్ప నేరము నారోపించి ప్రభుత్వమువారు కేసును పెట్టిరి. ఈ కేసులో చిత్తరంజనుడు ఆరుమాసములు మిక్కిలి శ్రమపడి జయముగాంచెను. దాసుయొక్క ఆర్గ్యుమెంటును చదివి ప్రజలు ఆశ్చర్యపడిరి.

ఈ కేసులో ధనమును గడించకపోయినను దాన్కి వేయిరెట్లు కీర్తినిగడించెను. మఱియు సంధ్యాపత్రికా సంపాదకుడగు బ్రహ్మోబందమ్ ఉపాధ్యాయునిమీదను, యుగంధర్ పత్రిక సంపాదకుడగు భూపేంద్రనాథ్ దత్తుమీదను అరాజక విషయములను వ్రాసినందుకు ప్రభుత్వము కేసు నారోపించెను.

ఈరెండు కేసులలోను చిత్తరంజనుడే పనిచేసి జయము గాంచెను. పత్రికా సంపాదకులకు పత్రికలను ప్రచారములో నుంచెనపుడు ప్రభుత్వప్రజలయొక్క నిజమైన అభిప్రాయము లను వెల్లడిచేయుట వారివిధియైయున్నది. అంతమాత్రమున వారు శిక్షార్హులు కాజాలరనియు, తీవ్రమైన వారి అభిప్రాయ ములను వెలిబుచ్చుటకూడ నిందితముకాదని చిత్తరంజనుడు వాదించెను. ఈవిధమైన కేసులన్నిటిలోను చిత్తరంజనుడు తన మేధానిపుణతలను జూపి జయముగాంచి న్యాయాధిపతులను ప్రజ లును కూడ దిగ్భ్రమచెందించెను. అప్పటినుండియు కేసులధిక మయ్యెను. పానకాశము లేక కొన్ని కేసులను తిరుగగొట్టు చుండెను. ప్రజలధికముగా వచ్చుచుండిరి. స్నేహితులతో మాట్లాడుటకుకూడ చిత్తరంజనుకి తీరిక లేకయుండెను. తన రాబడి అధికముగానున్నను శ్రమయెక్కువగా నుండెను. చాల మందితని సలహాలనుపొంది ఇతరన్యాయవాదులలో బనిచేయిం చుకొనుచుండిరి.

మఱియొక కేసు బయలుదేరెను. కింగ్సుఫోర్టు అనునతడు డిస్ట్రిక్టుజడ్జిగానుండెను. ఇతడు కొన్ని కేసులలో బాహుళ్యమైన శిక్షలనువిధించెను. ఇది ప్రజలకు కష్టముగానున్నది. బెంగాలులో మొదటినుండియు రివల్యూషనరీపార్టీయున్నదను విషయము మనకు తెలిసినదే! 1908 సంవత్సరము ఏప్రిల్ నెలలో కుదీరమ్, ప్రఫుల్లచక్ అను నిద్దరుబాలురు రివల్యూషనుపార్టీలో బనిచేయుచుండిరి. వీరు కింగ్సుఫోర్టును చంపుటకు బ్రయత్నము చేసి, అతడు తిరుగుచుండు బండివంటిబండియే పోవుచుండ యందు జడ్జియుండెనని భ్రమించి దానిపై నొకబాంబును వేసిరి. కాని ఆ బండిలో నొక కుటుంబీకులు ప్రయాణమై పోవుచుండిరి. బండిలో నున్నవారికి దెబ్బలు తగిలెను. బండివాడు వెంటనే చనిపోయెను.

ఇది జరిగినవెంటనే బాలురు పలాయనమైరి. కాని పోలీసు గట్టిగా దరియాప్తుచేసి బాలురను పట్టుకొనిరి. వారి కోరిక నెఱవేరకపోయినను తుదకిది ప్రమాదమైన కేసుఅయినది. ఈ కేసులోగూడ చిత్తరంజనుడే వాదించవలసివచ్చెను. రివల్యూషనరీపద్ధతుల నితడంగీకరింపకపోయినను స్నేహితులు ప్రోద్బలముచే నీకేసును తీసికొనెను. బాలురను కేసునుండి తప్పించుటకు జాల శ్రమతీసికొని పనిచేసెను. మిక్కిలి చమత్కారముగా కేసులోవాదనచేసెను. ఇటువంటికేసులో బనిచేసి

చాలమట్టుకు జయమును గాంచుటచే అపారమైన కీర్తిని గడించెను. దూరదేశములనుండికూడ ప్రజలితని దగ్గరకు వచ్చుచుండిరి. ఇతనివృత్తిలో ధనార్జనమధికముగా నున్నది.

ఇంతటి ఆదాయము ఇదివర కేన్యాయవాదికి వచ్చియుండుట మనమెఱుగమనియే చెప్పవలయును. 1917, 18, 19 సంవత్సరములలో చిత్తరంజనుయొక్క సంవత్సరాదాయము మూడులక్షలరూపాయలు. 1920 సంవత్సరములో నెలకు 50000 రూపాయ లాదాయమునకు తక్కువ లేదు. వృత్తి నివదలువరకిది యే యాదాయము. ఇంతధనమును చిత్తరంజనుడు విచ్చలవిడిగా దానధర్మములను చేసెను. ధనాపేక్ష లేనివాడగుటచే సత్కర ధర్మకార్యములను జేసెను. 1921 సంవత్సరములో గాంధీయుద్యమము ప్రచారములోబడి గాంధీలో సహాకార మేర్పడినవెంటనే భాగ్యపుంజమగు తనవృత్తిని బహిష్కరించెను. ఇంతటి త్యాగముచేసి దేశసేవ ప్రారంభించెను.

చిత్తరంజనునకు ప్రాక్టీసుచేయు సమయములో లార్డు మింటో, లార్డు మార్లె, హార్డింగ్ ప్రభువు మొదలగువారు హైసాప్రియ పదవులలోనుండి వెళ్ళిరి. హార్డింగ్ ప్రభువుమీద రివల్యూషనరీపార్టీవారు బాంబును వేయగా ప్రమాదమైన గాయములు తగిలినవి. వెంటనే యతనిని చికిత్సాలయమునకు

తీసికొనిపోయి బ్రతికించిరి. రివల్యూషనరీపార్టీ యొక్క ఘోర కృత్యములను చిత్తరంజనుడువిని సహించలేక విచారించుచుండెను. ఈపార్టీని హతమార్పవలెనని యతని అభిప్రాయము. దీనివిధానమెట్టిదియని యతడు మిక్కిలి శ్రమపడుచుండెను.

ప్రజలకు హృదయకాఠిన్య మెంతమాత్రమును పనికిరాదనియు, క్రూరకృత్యములు మనస్సులో జనింపరాదనియు, యిట్టి అమానుషములు హరింపచేయుటకు బ్రజలు కొన్నిపద్ధతుల ననుసరింప వలయునని చెప్పెను.

ముఖ్యముగా విద్యావంతులగు ప్రజలందరును హిందూ దేశ పూర్వచరిత్రములను చదువవలెను. ఇతర దేశ చరిత్రలను కూడ చదువుట మంచిది. ఈవిషయములనువిద్యావిహీనులకు బోధింపవలయు. మనకు ప్రస్తుతము ప్రభువులు ఆంగ్లేయులు వారిపద్ధతులను ప్రజలు విసర్జింపవలయును. వారిననుకరణము చేయరాదు. చిన్నగ్రామములు పెద్దగ్రామములు నశింపకుండజూడవలెను. వాటివృద్ధికై పాటుపడవలెను. పట్టణములో జనాభివృద్ధి యెక్కువగాకుండ చూడవలయును.

జనాభాను గ్రామములోనికి సమర్థింపవలయు. గ్రామములలో ప్రజాసౌకర్యములను చేకూర్చవలయును. గ్రామము

లో ఆరోగ్యపరిస్థితులను కాపాడి రైతాంగము సుఖముగా నుండునట్లు చేయవలెను. వ్యవసాయదారులకు చేతిపనులనుకూడ నేర్పవలయును. సంవత్సరములో కొన్నిమాసములువారికి పనిపాటులుండవు. అప్పుడు వారిచేతిపనులనువృద్ధిచేయుదురు. ఇవన్నియు ధనమును గడించు విధానములు. బెంగాలుదేశములో నిదివరకు తయారైన వస్తువులవిషయమై గమనింపవలయును.

వీనితో వర్తకము చేయుటకును తయారుచేయుటకును, వీలుగానుండును. ఇతరదేశములలో [illegible] వచ్చును. ప్రజలకు ముఖ్యముగా [illegible] చిన్నవర్తకములను ప్రారంభించి [illegible] వలెను. ధర్మమైనధరలతోనే యుత్పత్తికము [illegible] పొందవచ్చును. మనము మిక్కిలి అవసరమైన వస్తువులుతప్ప అన్నివస్తువులను విదేశములనుండి దిగుమతి చేయుట కవకాశమీయరాదు. ప్రతివస్తువును యిక్కడనే తయారు చేయుటకు ప్రయత్నము చేయవలెను. బహుతక్కువ పెట్టుబడిలో నెక్కువలాభములను గడించుటకు ప్రయత్నము చేయుట మంచిది.

ప్రజల కనుకూలమైన పద్ధతులమీద ధనసహాయము చేయు బ్యాంకులను వివిధజిల్లాలలో నిర్మింపవలయును. దీనివలన వాణిజ్యమున మనప్రజలకుకూడలకు చేయూతగానుండును.

దీనికి ముఖ్యముగా దేశాభిమానులు కలిగియుండిన బాగుపడును. మఱియు మీరు నేర్చినవిద్య సరియైనదని గ్రహింపవలయును. విద్యానియోగము సవ్యమైన మార్గములో లేకపోయిన ప్రయోజనము లేదు. మీరు యేవిషయమునైనను కార్యక్రమములో జూపవలయునుగాని వట్టిమాటలతో సరిపెట్టిన ప్రయోజనము లేదు. దేశసేవ కనుమాయినైన విద్యనేర్చినచో మీ మేధాశక్తి తప్పక వృద్ధిపొందును. పీనివలన దేశమునకును ప్రజలకునుగూడ ప్రయోజనమున్నది. తిప్పయను బెంగాలీభాషకే ప్రాధాన్యమీయవలెను. ఇదియే వ్యవహారికభాషలో నుండవలెను. శాస్త్రపద్ధతులను సంగ్రహముగా ప్రజలు గ్రహించినపుడు దేశసేవయన నేమియో వారికి బోధపడును దీనివలన దాస్యరాహిత్యము కలుగును. ప్రజలలోనున్న క్రూరావేశము పూర్తిగా నశించును.

1917 సంవత్సరములో చిత్తరంజనుడు పూర్తిగా రాజకీయములో ప్రవేశించెను. తీవ్రమైన ప్రచారములనుకూడ చేయుటకు ప్రయత్నముచేసెను. కోర్టులకు వేసవికాలసెలవులు యిచ్చినపుడు బెంగాలులో ప్రతిగ్రామమునకునుబోయి వారి పరిస్థితులను గమనింపవలయునని ప్రయత్నముచేసియు చిత్తరంజనుడు పూర్తిగా సాగింపదలచెను. చిట్టగాంగులో నుద్రేకమైన నుపన్యాసము నిచ్చెను. ఈ సందర్భములో మోడరేటు

పార్టీవారిని గట్టిగా మందలించెను. ఈపార్టీనాయకుడైన సురేంద్రనాథ్ బెనర్జీని ధూర్తుడని నిందించెను. ఇవడు దేశద్రోహము చేయుచుండెననియు, నతని యుపన్యాసములను విని ప్రజలు మోసపోవుదురనియు జెప్పెను. ఇక్కడకొన్ని విషమపరిస్థితులలో ప్రజలు తగుల్కొనిబాధపడుచుండిరి. స్వాతంత్రిహక్కునకు లేక స్వరాజ్యమునకా ప్రయత్నము చేయునదని వారిప్రశ్న. దాసు 'స్వరాజ్యమునకే' యని విశదముగా నొక్కిచెప్పెను.

1920 సంవత్సరము సెప్టెంబరు నెలలో గాంధీమహాత్ముడు నాన్‌కోపరేషను మూమెంటును స్థాపించుటకు బ్రయత్నము సేయ చిత్తరంజను డడ్డుతగిలెను. మహాత్ముని ప్రచారమున కతడు గొప్ప యాటంకమాయెను.

మహాత్ముడు తన యాత్మపరిశోధనవలన మరల నాగపూరులో వీరిద్దరును సమావేశమైనపుడు చిత్తరంజనుని వశపఱచుకొనెను. తన అభిప్రాయములన్నిటిని అతని మనస్సునకు నాటించెను. వారొక యొడంబడికలోనికి వచ్చిరి. దీనినే దాసు గాంధీ ఒడంబడికయందురు.

చిత్తరంజనుడు కలకత్తాకు తిరిగివచ్చి వెంటనే గాంధీ తత్వము నవలంబించి ప్రచారముచేయుచుండెను. ఇతనికిట్టి మార్పువచ్చుటకు మహాత్ముని శక్తియేయని ప్రజలు గ్రహింప

కలిగిరి. దేశసేవయన ప్రజాభిప్రాయముతో గూడినదిగాని గాంధీతత్వవిచారణకాదని దాసు గ్రహించి అనుభవనీయమైన ప్రజాభిప్రాయమునుబట్టి కర్తవ్యమును నడుపుచుండెను. హిందూ మహమ్మదీయ సమ్మేళనమునకై చిత్తరంజనుడుచాల పాటుపడెను. ఇతనికిట్టి అభిప్రాయమున్నట్లు 1917 సం॥న అక్టోబరు 7 తేదీని కలకత్తాలో హిందూ మహమ్మదీయులు సభ చేయగా దాసు యాసభకధిపతిగానుండి మాట్లాడిన మాటల వలన మనము గ్రహింపగలము.

'ఆర్యులారా! ఈ ప్రొద్దుట అకరిముఖాన్ నన్ను సభకు ఆధిపత్యము వహింపమని కోరగా మిగుల సంతోషించితిని. ఇప్పుడు జరుగుచున్న యుద్యమము హిందువులకును, మహమ్మదీయులకునుగూడ సమానమే! 1905 సంవత్సరములో నొకానొక కాలమందు నేనును నా మిత్రుడు బిపిన్ చంద్రపాలును, యెప్పటికైనను హిందూ మహమ్మదీయులు కలిసి ఒకేవిషయమై పనిచేయుదురని అనుకొంటిమి! ఆ తరుణమిప్పుడు వచ్చినది. కాని అట్టి సమయమింతత్వరలో వచ్చునని నేననుకొనలేదు. ఈ తరుణములో రసూల్యామరణము నాకు విచారమును కలుగజేయుచున్నది. అతడు సజీవుడైయున్నచో నీయుద్యమములో గొప్పసహకారిగా నుండెడివాడు. మతభౌతికముల న్నను హిందువులకును మహమ్మదీయులకును స్నేహభావమును వృద్ధిచేసి దేశసేవ చేయుటకు గొప్పప్రయత్నములు చేసిన

వాడు. మహమ్మదీయులలో నత డగ్రగణ్యుడని చెప్పకతప్పదు. గొప్ప బుద్ధిశాలి. దూరదృష్టి గలవాడు. విద్యావంతుడు. రాజకీయములో ననుభవము గలవాడు. అన్నిమతములవారు అతనిని సమముగా గౌరవించిరి. నేను ప్రస్తుతము కొంతమంది పేర్లను చెప్పుచున్నాను. మొదటివాడు మహమ్మదాలీ. ఇతడు విఖ్యాతిపొందిన మహమ్మదీయుడు. దేశసేవయే తనజన్మకృత్య మని తలంచినవాడు. ఇతడు కలకత్తాలో నున్నపుడు నాతో రాజకీయవిషయములను గూర్చి సంప్రదించెడువాడు.

అతనిసోదరుడు షౌకత్ అలీ. ఇతనిని నేను స్వయముగా నెఱుగను. కాని హిందూమహమ్మదీయ కూటమికై యితడు గొప్ప శ్రమను వహించుచుండెనని నేను వినియున్నాను. మూడవది షేం సుందరచక్రవర్తి. వీరేగాక తదితరులుకూడనుండిరి. వీరిని యింటర్న మెంటులో నుంచుటకు నందువలన బెంగాలంత యును విచారగ్రస్తమైయున్నది. ఈవిషయమును నేను గట్టిగా మీతోరిపునకూడ ఖండించుచుంటిని. ఇట్టి అవయోగ్యమైనకార్య ము బ్రిటిషుప్రభుత్వ క్షీణదశ ముందురానున్నదని తెలియుచు న్నది. ఇది పరిజ్ఞానము నుపయోగించి చేసినపనికాదని నాఅభిప్రాయము.

దేశములో ప్రశాంతము కలిగించుటకై తగినచర్యను తీసికొనవలసియుండునని బ్రిటిషుప్రభుత్వము చెప్పెను. కాని

దేశములో నెంతవరకు ప్రజలకు సౌకర్యమును వారు కలుగ జేయుచుండిరి. ఏ దేశములోనైనను ప్రభుత్వ మొకవ్యక్తిని తన స్వాతంత్ర్యమునువదలి, మతమునునవదలుమని చెప్పుట కధికార మున్నదా? ప్రజలయొక్క మతవిషయములతో సంబంధము కలుగజేసికొనకూడదు. వీ రైనంతవరకు వీరిస్వాతంత్ర్యశక్తిని అణచివేయరాదు. కాని దేశములో ప్రశాంతముకొఱకు పాటు పడవలెను. మీరందరును హిందువులనియు మహమ్మదీయు లనియు మతవిశేషతలను వహింపక సోదరభావముతో నేకగ్రీ ముగా నిశ్చయమైన మనస్సుతో దేశసేవ చేయుటకు సంసి దులుగా నుండుడు.

మీ అభిప్రాయము ప్రకారము మీరు ప్రవర్తించుటకు మీకు సర్వాధికారమున్నది. ఎవరిఅభిప్రాయములు వారు ప్రపంచమునకు వెల్లడిచేయవచ్చును. కాని దేశసేవక కనుగుణ ముగానుండునట్లు చేయవలెను. మీలో ప్రతివారికిని వేరువేరు అభిప్రాయము లుండవచ్చును. నాఅభిప్రాయము వేరుగానుండ వచ్చును. ప్రభుత్వముయొక్క అభిప్రాయములు వేరుగానుండ వచ్చును. ఇందు వ్యతిరేకాభిప్రాయులు చాలగా నుండవచ్చును భేదాభిప్రాయులు కలిగియున్నవారు శిక్షార్హులగుదురా! వీని వలన నవనాగరీకమైన చరిత్రలో లోపముకలుగునా? వెనుకటి రోజులన్నియు పోయి నూతనప్రపంచము వచ్చినదని నేను భావిం చుచుంటెని. 1857 సంవత్సరలో ప్రభుత్వచట్టము ప్రకారము

తీరుగావించిన విధానమునుబట్టి వారుచెప్పినదేమనగా! మాసా మ్రాజ్యపరిపాలనములో ప్రజలుకష్టములను భరింపరాదు. ప్రజా సుఖమునకు మేము పాటుపడుదుము.

వారి మతవిషయములో మేము కలుగజేసికొనము. ప్రజా క్షేమమే మాకు ప్రధానము. ఇదియే మనకొక మోగ్నాకార్ట యని మనము భావింపవలయును. ఈచట్టమున కనుబంధముగా నే వారు ప్రవర్తించవలసియుండెను. విక్టోరియారాణి చెప్పిన విషయములుకూడ వీరు చదువుచున్నారు. ఎవరిమతము లను వారు పోషించుకొనుచు దేశమునకై కష్టపడవల యును. మనము నా [illegible] వ్యాఖ్యానముగా ప్రవర్తించుటలేదు. మనప్రభువునకు వ్యతిరేకముగా మనము సహించుటలేదు.

మొదట బ్రిటీషు ప్రభుత్వాభిప్రాయ మిదికాదు. క్రమముగా మనస్వాతంత్ర్యమును అరికట్టుటకు వారు ప్రయ త్నముచేసిరి. కారణములేనిదే వారు మన స్వాతంత్ర్యమును పాడుచేయుచుండిరి.

ఈ విషయమై వారిని కలిసి ఆలోచింపవలయు నని మనప్రజలిదివరలో ననేకపర్యాయములు కోరియున్నారు. వారు దీనిని పూర్తిగా విచారించునేమోగాని, దీనికొక చిక్కువచ్చి నది. తెల్లవారు మనతో కలిసి యిక్కడనుండి వారభిప్రాయ

లును ప్రజలకలవడునట్లు చేసిరి. వారి సంహారాగము మనకు పనికిరాదు. వారిఅలవాట్లన్నియు మనకచ్చినవి. తుద కివి మనకు దుర్వ్యసనములైనవి. మొదట వర్తకముచేసి ధనము నార్జించుటకై బ్రిటిషువారు మనదేశమునకు ప్రవేశించిరి. మొదట వీరి కెట్టియూదాయమును లేదు. అప్పటి హిందూదేశపు రాజులతో స్నేహముచేసి నిమ్మదిగా దేశములో బ్రవేశించిరి. క్రమముగా దేశములో బాలుకొనిపోయి దేశమునంతటి నాక్రమించుకొనిరి. మహమ్మదుఅలీ మొదలైన నాయకులు బయటయున్నచో దేశస్వాతంత్ర్యముకొఱకు గట్టిగా బని చేయుదురని దొరతనమువారికి తెలియును. స్వాతంత్ర్య మిచ్చినచో ప్రభుత్వాధికారులు తగ్గిపోవలసియుండును. ప్రథమమున ఇండియాలో ధనము రాకపోయియున్నచో నప్పుడే వారు వెనుకకు మరలియుందురు.

ఈదేశము ధనవంతమైనదని వారు గ్రహించిరి. ఇక్కడ సమస్తపదార్థములును దొరకును. వెండి బంగారములు దొరకును. అన్ని పంటలు ఈ దేశములో పండును. వారికి గావలసినవన్నియు నిక్కడ దొరకును. ఇటువంటి దేశమును వా రెట్లు వీడి యుండగలరు. వారిలో కొందరు మనకు స్వాతంత్ర్య మిచ్చినచో ప్రజాక్షేమము తగ్గిపోవునని చెప్పుచున్నారు. వీరు రాకముందు ప్రజాక్షేమ మెట్లున్నది? ప్రజలయొక్క ఐశ్వర్య మెట్లున్నది. మనక్షేమము మనను తెలియును. మనసిరిసంప

దల నెట్లు అభివృద్ధి చేయవలెనో మనకు తెలియును. మనకు స్వాతంత్ర్య మిచ్చిన వారి ఐశ్వర్యము తొలగిపోవును. వారి సౌకర్యము లన్నియు చెడును. మనమీాద నభిమానమున్నట్లు వారు వ్రాయుచుందురు. మీారు వీటి నెన్నడును నమ్మరాదు.

ఈ హిందూమహమ్మదీయ ఐకమత్యమును పాడు చేయవదు. కలహములకును భేదాభిప్రాయములకును తావీయ వద్దు. కంజాయింపుగా దేశమునకు సేవ చేయుడు. అప్పుడు స్వరాజ్యము తప్పక వచ్చును.

ఇట్టి ఉపన్యాసములను బట్టి హిందూమహమ్మదీయ సంఘమునకై చిత్తరంజనుడు పడిన శ్రమను గ్రహింపవచ్చును. అనేకవిధములుగా బ్రచారము సాగించి ప్రజలయొక్క అభిప్రాయములను గ్రహించి దేశపరిస్థితులను గాంధీప్రచారమును వారికి బోధించి విరివియైన కట్టుబాటును చేసెను. గాంధీ తత్వమును బూర్తిగా విచారించి దీనిలో నిర్మలమైన ప్రచార స్వభావ ముండినను కౌన్సిలులోనికి ప్రవేశించి అక్కడనుండియే సాధించకపోయిన దేశమునకు దగిన అవకాశములు చిక్కవని గట్టిగా ప్రయత్నము చేసి ఎసెంబ్లిలలోనికి కాంగ్రెసునాయకులను ప్రవేశపెట్టెను.

ఈయుద్యమము బెంగాలులో తీవ్రముగా నుండుసమయములో అనేకవేలమంది విద్యార్థులను పట్టుకొని చెఱసాల

యుం డెంచిరి. 1921 సంవత్సరము డిశంబరు నెలలో చిత్త రంజనుభార్యయగు బసంతీదేవి మరికొందరు స్త్రీలను ఖద్దరు ప్రచారము చేయుచుండగా పట్టుకొనెను. స్త్రీపురుషవిద్యార్థుల ననేకులను బంధించిరి.

ఈ విషయమును అప్పటి హిందూదేశమంత్రులకు జలియనువలుచుకురుం గూఢముగా నుంచిరి. దీనివలన దేశములో నెక్కడ జరుగుచున్నను పత్రికలలో ప్రభుత్వాధికారుల పనులను ఖండించువారు ఏమియు వ్రాయకుండ నుంచిరి. అప్పుడు చిత్తరంజను మొదలగు నాయకులు క్రియాత్మకమైన చర్యలతో ప్రభుత్వమునకు విరుద్ధముగా ప్రచారము సాగించిరి.

ఆసమయములో లార్డు మాంటేగు యింగ్లండు గవర్నమెంటునుండి కొన్ని రిఫారములను తీసుకొని వచ్చెను. వీటిని దేశనాయకులు సంతోషముగా అంగీకరించి యుండలేదు. ఇవి దేశమున కనుకూలముగ లేక ప్రతికూలముగా నుండెను. చిత్తరంజను డీరిఫారములను పూర్తిగా రద్దుచేయవలెనని ప్రయత్నము చేయుచుండెను. ప్రభుత్వము కొన్నిమార్పులను చేయవలెనని ప్రయత్నము చేసెను. అప్పుడు ప్రభుత్వము 1924 సంవత్సరములో నీరిఫారముబిల్లును పరిశీలించి అవసరమైన మార్పులను చేయవలెనని ఒకకమిటీని యేర్పాటు చేసెను. ఈకమిటీలో చాలపెద్దవారు గలరు. హిందువులుకూడ కొంతమంది యుం

డిరి. ఇట్టికమిటీ అవసరము లేకనియు, రిఫారములను పూర్తిగా నడుగంట చేయుమనియు దేశప్రజలు దద్దరిల్లు గగ్గోలుపెట్టు చుండిరి.

ఇప్పటికి మఱియొకసారి చిత్తరంజనుడు స్వరాజ్యపార్టీ యని లేవదీసి గాంధీతత్వమునకు వ్యతిరేకముగా కౌన్సిలులలోనికి ప్రవేశించుటకు గట్టిప్రయత్నము గావించెను. వల్లభాయిపటేలు, రాజాజీ మొదలైనవారు దీనికి ప్రతికూలురై నాయమని అభిప్రాయములనే ఆమోదించిరి. తనప్రయత్నములన్నియు ఫలించునట్లు చేసెను. చిత్తరంజనునియొక్క గొప్ప అభిప్రాయములను నాయకులు గ్రహింపలేకపోయిరి. గాంధీతత్వమున కిది సరిపోలేదు.

చిత్తరంజనుడు బాల్యమునుండియు దేశభక్తి కలిగి యుండెను. ఎప్పటికైనను దేశమునకు సేవచేసి సఫలీకృత మనోరథుండు కావలెనను చూచెను. యుద కట్లు చేయకలిగెను తనఅభిప్రాయమును నెఱవేర్చెను.

మొదట 1906 సంవత్సరములో నేషనల్ కాంగ్రెసునకు డెలిగేటుగా వెళ్లెను. అక్కడ దేశీయకుల తత్వమును గ్రహించెను. తాను మూడుపన్యాసములు నిచ్చెను. ఇట్టి ప్రచారమువలన కొంతఅనుభవమును సంపాదించెను. 1917

సంవత్సరమువరకు నుద్యమములో బనిచేయక బయటనుండి తనవృత్తిలో బ్రవేశించెను. కాని యుద్యమమునకు సహాయము చేయుచుండెను. ఈసంవత్సరములోనే ఏనీబ్ సెంటు కాంగ్రెసు ప్రెసిడెంటుగా నియమింపబడినపుడు చిత్తరంజనుడు గొప్పగా బనిచేసెను..

1924 వ సంవత్సరమువర కేకదీక్షగా యుద్యమములో బనిచేసి దేశములో గొప్పకీర్తిని గడించెను. 1924 సం॥ లో బెల్గాము కాంగ్రెసునకు మహాత్ముడు ప్రెసిడెంటుగా నున్నపుడు చిత్తరంజనుడు బెల్గాము వెళ్ళి చాలకష్టపడి నిద్రాహారము లేకుండ పనిచేసెను. ఏవిషయమునైనను పూర్తిగా తరచిచూచేసినగాని దానిని కార్యక్రమములో బెట్టువాడు కాడు. ఇతని కిట్టిమేధాశక్తి యున్నదని మహాత్ముడు గ్రహింపకలిగి యితని అభిప్రాయములను జాగ్రత్తగా విచారించువారు.

1921 సం॥ లో అహమదాబాదు కాంగ్రెసున కతనిని ప్రెసిడెంటుగా నెన్నుకొనిరి. కాని యితడంతకుముందుగానే యుద్యమప్రచారములో పట్టుపడి జైలులో నుండెను. ఇతడు జైలులో నుండగా నాయకులు స్వేచ్ఛగా నితనితో మాట్లాడుచుండిరి. ఈసమయములో పండిత మదనమోహనమాలవ్యా అప్పటికి వైస్రాయిగా నున్న రీడింగుప్రభువుతో సంప్రదించి రౌండుటేబిలు విషయమై చిత్తరంజనునలహా నడిగెను. తాను

జైలులోనుండి చెప్పుట మంచిదికాదని మహాత్మునికి ఆవిషయ మును వదలిపెట్టెను. మాలవ్యా గాంధీతో గలిసి సంప్రదింప గాని బార్డోలీ నిర్ణయమును రద్దు చేయమని మరియు దాని వలన దేశమునకు ప్రయోజనము లేదనియు వెల్లడిచేసెను.

ఈవిధముగా మాలవ్యా రీడింగుసంప్రదింపులు చెడినవి. ఫలితము లెట్లుండునో జూడకయే వదలికొనవలసి వచ్చినది. ఇది విని చిత్తరంజనుడు చాల విచారించెను. ఇట్టిరాజకీయవిష యములలో గాంధీకి దూరదృష్టి తక్కువ యని చిత్తరంజను నభిప్రాయము.

చిత్తరంజనుడు అలీపూరు సెంట్రిలుజైలులో 6 మాస ములుండెను; 1922 సంవత్సరము జూలైనెలలో జైలునుండి బయటకు వచ్చెను. అభిప్రాయభేదములు కలుగుట ప్రారంభ మయ్యెను. స్వరాజ్యపార్టీని పూర్తిగా లేవదీసి తనస్వాతంత్రి శక్తివలన నుద్యమమును సాగించుచుండెను. స్వరాజ్యపార్టీతో ప్రతిరాజకీయములోను పనిచేసి కౌన్సిలులోనికి ప్రవేశించి గొప్పజయమును గాంచెను. ప్రతిరాష్ట్రములోను స్వరాజ్య పార్టీయే జయప్రదముగా నుండెను. అప్పుడు మంత్రులయొక్క జీతములనుగూర్చి సాధించెను.

1924 25 సంవత్సరములకు గవర్నమెంటు బడ్జెట్టు ప్రకారము మంత్రులయొక్క జీతములను తగ్గించివేయవలెనని

పట్టుపట్టెను. చిత్తరంజనుడు తనస్నేహితులును కలకత్తాహై కోర్టునుండి యిన్‌జన్‌షన్ తీసికొని మంత్రులాశయములు బట్వాడా కాకమునుపే యుద్యమమును సాగించెను. చిత్తరంజనుడు ఒక కార్యమును బట్టుకొనిన దానిని సాధించువరకును జయప్రధముగా జరుగవరకును నిద్రాహారములులేక పనిచేయును. హైకోర్టుయింజక్షనుతో యెసంబ్లీలో ప్రెసిడెంటు ప్రపోజలనిను పెట్టకుండ చేసెను. అవకాశమునుబట్టి కార్యసాధనము చేయ కలుగును. నరపటు పట్టినట్లు కీలక మెక్కడుంటునో దానిని గ్రహించి పనిచేయును. సమయస్ఫూర్తియైన విచారణ కలిగి యెట్టికార్యమునైనను మనోధైర్యముతో సాధించును.

ఏపార్టీయైనను సమభావముతో బనిచేయని యెడల వారిప్రచారము దేశసేవకు భంగమును కలిగించునని చిత్తరంజను డెంతమాత్రమును వెనుగంజవేయక వారిని యెదుర్కొం వారికార్యములను తీవ్రముగా ఖండించును. అలదుచేతనే సురేంద్రనాథ్ బెనర్జీ మొదలగు మోడరేటుపార్టీవారి నెంతమాత్రమును సహింపక వారిదుష్ప్రచారములను ఖండించి లోకమునకు వెల్లడిచేసెను.

1924 సంవత్సరము పూర్తియగుసరికి చిత్తరంజనుడు తాను చేయవలసిన కార్యములన్నియు జయప్రదముగా సాగె ననియు, తనకు రావలసిన పూర్తిగౌరవము వచ్చినదనియు

జీవితముమీద నిరాశ కలుగుట ప్రారంభ మయ్యెను. తా నెంతకాలమో జీవింపనని చిత్తరంజనుని కనుమానము కలిగెను. సాధారణముగా నొకవ్యక్తికి లేబ్రాయములోనే కీర్తిగౌరవము లధికముగానుండి లోకవిఖ్యాతపురుషుండైనచో నట్టివానికి అల్పాయు వుందుదని శాస్త్రము చెప్పుచున్నది. ఇట్టివిధియే చిత్తరంజనునికి ప్రాప్త మయ్యెను. చిన్నవయస్సులోనే మరణము ప్రాప్త మయ్యెను. బెల్గాముకాంగ్రెసునకు వెళ్ళి 1925 సంవత్సరము జాన్యువరి 3 న తారీఖున కలకత్తాతిరిగి వచ్చెను. అప్పటికి చిత్తరంజనునికి తీవ్రమైన జ్వరము వచ్చుచున్నది.

శరీర మనారోగ్యముగా నుండెను. గృహము జేరుసరికి, ప్రమాదమైన జబ్బు చేసినది. డాక్టర్లు యితనికి విషప్రయోగ మైనట్లు అనుమానముపడి జాగ్రత్తగా మందు నిచ్చి జబ్బును తగ్గించిరి. శరీరస్వస్థత పూర్తిగా రానేలేదు. చిత్తరంజనుడు భవానీపురిమందలి తనగృహమునుండి మూడుమైళ్ళదూరములో నున్న పురమందిరములో బెంగాలుకౌన్సిలు సమావేశ మగుననువిషయమును తెలిసికొని అక్కడకు బయలుదేరెను.

డాక్టర్లు యెంత చెప్పినను వినక బహునీరసముగా నుండుస్థితిలో పురమందిరసమావేశమునకు వెళ్ళెను. రాజకీయములో దిరిగియున్న వ్యక్తి కాబట్టి తనశరీర అనారోగ్యస్థితిని

గమనింపకయే సభలకు బయలుదేరెను. దేశసేవయందు దృఢప్రీతిని కలిగియుండెను. కాని క్రమక్రమముగా శరీరమందనారోగ్య మధికముగా నుండెను. ముందురాబోవు విషయములను గ్రహించినవాడై ఒకవీలును చిత్తరంజనుడు వ్రాసెను.

ఇంతు తనకున్న ఆస్తినంతయు దేశసేవకు సమర్పించెను. హిందూస్థానదేశములోని హాస్పటలులలో హిందూస్త్రీలనిమిత్తమై వారియొక్క బాధలను నివారించుటకై ధనవ్యయము చేయుమని వ్రాసెను. మొదటినుండియును ధర్మకార్యములకెన్నియోను ధనమును ఖర్చుపెట్టెను. ఇప్పుడున్న మహాత్మాగాంధివలెను ముందు తనకున్న యావదాస్తిని దేశమునకర్పించుచుండెను.

1925 సంవత్సరము మార్చి యేప్రిల్ నెలలో [illegible] తీవ్రచర్యలధికముగా నుండుట విని, [illegible] మును నెన్నడును ప్రజలు ప్రోత్సహింపరాదనియు, [illegible] నాయకులు ధర్మమార్గమున ప్రవర్తింపవలెననియు దేశమంతయు బాధ పడుచుండియు తీవ్రమైన వ్యాసములను ప్రకటించెను. ఈవ్యాసములను ప్రభుత్వనాయకుడు చూచి ప్రభుత్వమునకు తెలియపఱచెను. అప్పుడు ప్రభుత్వాధికారులు చిత్తరంజను సహాయముతో నిరివల్యూషనరీపార్టీని అణగద్రొక్కుటకు ప్రయత్నము సలిపిరి. కాని చిత్తరంజనునియొక్క శారీరకపరిస్థితులు వీలుగా లేక అతడు శీఘ్రముగా జూచుకొని యుండలేదు.

ఒకవేళ గట్టిగా బ్రయత్నము చేసినను ప్రాణాపాయ మంతగా నుండదని చిత్తరంజనుడు గ్రహించెను.

తరువాత కొన్ని దినములు గృహమిందు విశ్రాంతి దీసుకొని ఫరిదాపూరు కాంగ్రెసునకు వెళ్లెను. ఇక్కడ కార్యక్రమము వలన శరీరబడలిక వచ్చి మరల తీవ్రమైన జ్వరము వచ్చినది. అప్పు డింటికి వచ్చెను. డాక్టర్లు యతనిశరీరము పూర్తిగా జబ్బుస్థితిలో నున్నదనియు, పాశ్చాత్యదేశములకు వెళ్లి విశ్రాంతిని గైకొనుట మంచిదనియు సలహా నిచ్చిరి. యూరపుదేశము వెళ్లినచో అప్పటికున్న రాజకీయములనుబట్టి దేశనాయకులను ప్రభుత్వమునుకూడ భేదాభిప్రాయములు కలుగునేమోయని గ్రహించి యూరపుదేశమునకు వెళ్ళుట కిష్టపడ లేదు. హిందూ దేశములోనే మంచిప్రదేశమునకు బోయి విశ్రాంతిని బొందవలెనని తలంచి తుదకు డార్జిలింగు వెళ్ళుటకు నిశ్చయించెను.

డాక్టర్లు డార్జిలింగు పోవద్దని చెప్పినను వినక ప్రయాణమై డార్జిలింగు జేరెను. కొంతధనమును తనవెంట దీసికొని పోయి బ్యాంకులో వేసెను. ఈధనముతో తనజీవనము గడచిపోవునని గ్రహించెను. అందు కొంతధనమును పెట్టి ఒకగృహమును కొనెను. మిగిలినధనము తనస్వవిషయమునకై యుంచెను.

ఇట్టిసమయములో సురేంద్రనాథ్ బెనర్జీయు లిస్టన్ ప్రభువును, చిత్తరంజనుతో గలిసి దేశమందలి యుద్యములను గూర్చి తీర్మానించుటకొక సమావేశము నేర్పఱచుటకు బ్రయత్నము చేయ, చిత్తరంజనుడు దీని కంగీకరించలేదు. క్రమముగా శరీరానారోగ్య మధికముగా నురికెను. 13 జాన్యువరిలో కడుపులో నొకవిధమగు నొప్పి బయలుదేరినది. అప్పటికి చిత్తరంజనుడు నిర్మలముగా నవ్వుముఖముతోనే మాట్లాడుచుండెను. మరల 1925 సంవత్సరము జాన్యువరీ 16 తేదీని పొద్దుట కడుపులో బాధమొదలిడి క్రమముగా నధికమై సాయంకాలమునకు ప్రమాదపరిస్థితులలోనికి మారినది. తన కవసానకాలము నగ్గరకు వచ్చినదనియు నిక గంటలో నున్నదనియు చిత్తరంజనుడు తనస్నేహితునితో జెప్పెను. సాయంకాలము అనగా సంధ్యవేళను నిర్మలమైన మనస్సుతో దేశబంధు చిత్తరంజనదాసు యీ బాహ్యప్రపంచమును వీడిపోయెను. ఆయనకనులు మూసెను. లోకమంతయు చీకటియయ్యెను.

చిత్తరంజను మరణవార్త దేశమంతయు వ్యాపింపగా ఆబాలగోపాలమును విచారించిరి. బెంగాలు ప్రజలకు కొన్నిదినములు మతిభ్రమయే కలిగెను. బెంగాలున కిటువంటి నాయకుడు మరల ప్రాప్తించడనియే చెప్పవలయును. దేవుడు యతని ఆత్మకు శాంతి నిచ్చుగాక!

చిత్తరంజనుని జీవితచారిత్రకవిశేషముల నెన్నొనట ప్రతి వానికిని సాధ్యము కానిపని. అయినను నామహాశయుని యసామాన్యమేధఃపుంజమునుండి వెలువడిన యద్భుతానంద సంధాయకములైన విశేషాంశములను గ్రహించుటకు ప్రతి పరిశోధకుడును, ప్రతి దేశసేవకుడును, ప్రతిరాజకీయవేత్తయు నుబలాటమును, ఆవేశమును, శ్రద్ధను ప్రకటించుచునే యుండును.

ఈవ్యాపారపూర్ణులైన దేశసేవకుని యవయవనిర్మాణ మావిధాతచే నట్లు సృజింపబడినదని పలువురు ప్రకృతిపరిశీలకుల యాథార్థ్యాత్మికమనస్సై యున్నది. ఇందు మఱొక్కవిశేషము గలదు. చిత్తరంజనునకు ప్రాచీనులైన దేశసేవకులందును, రాజకీయవేత్తలందును, సంస్కర్తలయందును, మహాపురుషులయందును, మతప్రవక్తలందును లేని గొప్పచిహ్నమొకటి చిత్తరంజనుని యఘటనాఘటనసామర్థ్యవిప్లవమును దెలుపు శపథాకృతి. ఇది పుట్టుకతో నుండుననియే మాఆశయము.

కొందఱితలం పట్లుగాక యిది భగవన్నిర్మితము గాదనియు, అవయవనిర్మాణానంతర పరిణామమే యగుననియు నైయున్నది. ఏది యెట్లున్నను చిత్తరంజనునందుమాత్రి మాప్రతిభ నిశితసంబంధముతో భాదుకొని శేషించిన సుగుణముల నామహనీయుడు పెంపొందించుకొనుటకు హేతువై యున్నది.

చిత్తరంజనునియందున్న ప్రజ్ఞావిశేషములు సామాన్య జనలభ్యములుగాని, సామాన్యప్రకృతిజన్యములని యనుటకు గాని యెంచుకేనియు శక్యంబుగాదు. పువ్వు పుట్టినతోడనే పరిమళము పుట్టి చెలరేగి తనంత దానే సర్వవ్యాప్తమై సలువంకలకు వాయుమిళితమై ప్రసరించునట్లు చిత్తరంజనుడు బాల్యమునుండియు సక్రమముగా నన్నిసల్లక్షణములను గలిగియున్నాడు.

అందు ముఖ్యముగా నెన్నదగినవి మొదట పితృమాతృభక్తి, వారియాజ్ఞావలంబనము, సత్యమార్గమందనువర్తనము, తనపూర్వులయడుగుజాడలలో నడచుట, విద్యాభ్యాసమందమితశ్రద్ధ, చూచినదానిని, వినినదానికి హృదయమందు పదిలపఱచుకొనుట, తండ్రినడచినపంథానే నడువ నేర్చుట మొదలగునవి.

బాల్యము వీడి యౌవనప్రాదుర్భావము కాగానే యేతద్గుణపుంజమును తనమేధాసంపత్తిలో స్వాయముగా పెంపొందించుకొనుట, అంతతో నాగక వయస్సునను మించిన విద్యాభ్యాసనము, అందువిస్తారముగా తోడిబాలురతో సహకారమొనర్చుట, ప్రతివిషయమునందును మున్సంజవేయుట, విద్యాసముపార్జనకాలమందే గొప్పవక్తృత్వమును సంపాదింప యత్నము నొనర్చుట, దేశస్వాతంత్ర్యవాంఛ, దేశసేవాసక్తి, కుటుంబమున పరస్పరసహాయముతో మెలంగనేర్చుట;

మాచరింపవలెనని తోడివిద్యార్థులకు సహకార మొనర్చుట మొదలగునవి.

చిత్తరంజనుని బుద్ధివైశద్యము మిగుల విశాలభావము లతో నిండియుండి ఆధునిక ప్రాపంచికపరివర్తనమునకు హేతుభూతమైనదని ప్రతిసామాన్యవ్యక్తియు త్రుటికాలములో గ్రహింపవచ్చును. ఆపుణ్యపురుషుడు తనబాల్యమందలి వాంఛల నన్నిటిని యౌవనమున పెంపొందించుకొని యౌవనమధ్య కాలమున వానినెల్ల పరిభూతము గావించుకొని తలచిన ప్రతి కార్యమునందును, విశేషకష్టములి సంపద్యే కృతకృత్యు డగుచు వంగరాష్ట్రమున ననన్యగనాయకమణి యనిపించు కొనెను.

విద్యాసముపార్జనకాలమందు తీవ్రమైనవాగ్ధాటిని, సుప్రసన్నతత్వమును అలవఱచుకొని దానిని సున్నితరఝురీవేగ తుల్యంబయిన యుపన్యాసప్రణాళిక కలిగించి దేశమునంతను ఉద్ఘాత లూగించినాడు. సత్యాగ్రహోద్యమకాలమున వంగ రాష్ట్రమునందలి విద్యార్థిబృందముల హృదయాంతరాళములు యుద్రేకమును రేకెత్తించి రాజకీయదృక్పథమున నవ్యప్రసక్తిని దోహద మొసంగినాడు. అంతేగాక తాను విదేశములకేగి విశేషవ్యయప్రయాసల కోర్చి యార్జించిన న్యాయవాదవిద్యను, తనపూర్వీకులను సాంప్రదాయసిద్ధమైన న్యాయవాదవృత్తిని

త్రుటికాలములో విసర్జించినాడు. ఇది చిత్తరంజనుని మనో ధైర్యము నెంత చాటుచున్నదో!

వంగరాష్ట్ర విభజనకాలమున కలకత్తాలోను, తత్ప్రాంతములను, ఇంచుమించుగా వంగదేశ మంతటను బయలు దేరిన విప్లవము నడంచుటకు బహుళ ప్రయత్న మొనర్చి తనకు దొరతనము వారియందు గల సౌజన్యతను, విప్లవమందున్న యుద్రిక్తతను, వినయశీలత్వముల ప్రకృతిని వెల్లడించికొని యసమానయశోవల్లికలతో బాటు యనన్యసాధారణమైన గౌరవ ప్రపత్తినిగూడ గడించినాడు. ఇంతేగాక తన దేశమందలి వివిధ విషయములలోను జోక్యము కలిగించుకొని ప్రజాబాహుళ్యమున కుపకరించు సత్యమార్గముల నన్వేషించి ప్రజానీకమునకు కష్టకాలములందు దోడ్పడినాడు.

మఱియు రాజకీయరంగమం దడుగిడి చిన్నతనముననే తనకన్న మిన్నయైన పెద్ద లనేకులుండ చిత్తరంజనుడే బెంగాలున కంతకును ఏకైకనాయకుడుగ నుండతగినవాడని ప్రజలచేతను, ఆనాటి పెద్దలచేతను, సకలప్రజానీకము చేతను అందె వేయించుకొన్నాడు. సమయమువచ్చినప్పుడును, సరియైన మార్గము కాదని తోచినపుడును, ప్రజల కపకృతి జరుగునని తలంపుగలిగినపుడును ముందు వెనుక లాలోచించి పెద్దలభావములకు ప్రతికూలముగా వర్తించి వారిని సామదానభేదోపాయ

ములచే సాధించి విశేషపరిశ్రమ కోర్చి తనమార్గమునకు ద్రిప్పు కొనుటేగాక వారు మొదట ప్రారంభించిన ఉద్యమ ప్రచార మును మొదలంట తుదముట్టువఱ కందుండి వెనుదిరుగక కార్య సాఫల్యత కడుదగ్గరగా నున్నదనిపించుకొనగానే యాభారమును పెద్దలకే విడిచి సఫలీకృతమనోరథుండై పేరొందినాడు.

చిత్తరంజను డమోఘప్రతిభాశాలి యనుట కాతని జీవితమునందలి పరిశిష్టవిశేషాంశములు వందలాదిగ నున్నవి. వాని నన్నిటిని జేర్చి వ్రాసినచో వ్రాతకులకు విసువు జనించుటే గాక యతిశయోక్తికూడ యగునేమో యని శంకింపవలసి యున్నది. దాసు కౌన్సిలుప్రవేశవిషయమున భరతఖండమున కంతటికిని ఏకైకనాయకుం డనదగిన మహాత్మాగాంధీజీ నెదిరించిన దిట్ట యనువిషయమును మరువకుడు. ఎదురించుటయేగాక నతనివలనను; అతనియనుచరులవలనను, ననుమతిని బడిసి కౌన్సిల్సులందు ప్రవేశించి పలుకార్యములను సాధించినాడు.

అంతేగాక దేశనాయకాగ్రగణ్యులలో నొక్కఁడైన పండితమదనమోహనమాలవ్యా యారంభించిన రిపబ్లిక్ సంప్రతింపులు దేశానర్థదాయకములని విశ్వసించి వాని కడ్డుదగిలి జయమందినాడు. మఱియు తనమేధాసంపత్తివలననే పిన్నవయసు వాఁడయ్యు కాంగ్రెసున కధ్యక్షుడుగా నెన్నుకొనబడినాడు. దొరతనమువారు కారాగృహమున బంధించి పలుబాముల

బెట్టినను వీసమేని ధైర్యమును వీడక యచ్చటనుండియే ప్రజా బాహుళ్యమున ఉద్యమసాంప్రదాయములను ద్విగుణీకృత మొలర్చినాడు.

చిత్తరంజనుని సుగుణపుంజమున మిన్నగా నెన్నదగిన దొకటి గలదు. అది ప్రాపంచికజీవనిర్మాణమున ననన్యసాధ్యం బగు పితాజ్ఞాపరిపాలనము. తండ్రిమాట జవదాట రాదనునది సర్వజనసామాన్యమైన గుణవిశేషమే యయ్యు నేటికాలమున దాని కీధర్మాత్రమేని గౌరవస్థానము లేదనుట సర్వజనాంగీకారమే యగును. అట్టిపరిస్థితులలో తలవు మీరిన తండ్రిచేసిన ఋణభారమును చేతులమీద తీర్చుటన్నది మహాగుణముగా నెన్నదగినదే. అందును కాయకష్టమున ఋణవిముక్తినందిన వారు ప్రతిఖండమందును వ్రేళ్ళమీద లెక్కపెట్టదగినవారుగ నున్నారు.

చిత్తరంజనుడు శ్రీరాముని వలెనే పితాజ్ఞాపరిపాలకుడు. గరుత్మంతునివలెనే మాతృభక్తియుతుడు. భరతునివంటి భార్యశూరుడు. లక్ష్మణునిబోలిన భ్రాతృవత్సలుడు. సముద్రుని వలె గభీరుడు. మహాశాంతుడు. దేశభక్తాగ్రగణ్యుడు. ధన్యుడు. భారతమాతపుత్రసంతతి యను మణిహారమున నాయకమణి.

సమాప్తము.

రాజమహేంద్రవరమున
బాలిశెట్టి రమణయ్య అండ్ సన్సువారి
బాక్సు ముద్రాక్షరశాలయందు
ముద్రింపఁబడియె.